

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 21 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో భర్తీ కాని సీట్లలో ప్రవేశాలకు నాల్గవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ కె.శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 26వతేదీ లోపు దరఖాస్తును రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థి సదరు దరఖాస్తును ప్రింట్ తీసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27వ తేదీన తాను చేరదలచుకున్న ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లను ధృవీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో 28న, ప్రైవేట్ ఐటీఐలలో 30వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

జీవన శైలి



కయ్యలో ఉప్పు సేకరిస్తున్న రైతు

రుచించని బతుకులు

● ఏళ్ల తరబడి మారని తలరాతలు ● ప్రకృతిపైనే ఆధారపడి 'ఉప్పు' పరిశ్రమ ● అనుకూలించకుంటే ఆశలు గల్లంతే!
● ఇంటిల్లిపాది కష్టపడ్డా గిట్టుబాటు అంతంతే! ● పాలకులు మారినా నెరవేరని హామీలు

ఎంత పెద్ద వంటకమైన చిటికెడు ఉప్పు తగ్గితే రుచించదు. ఆ చిటికెడు ఉప్పే భోజనప్రియులను 'ఓహో' అనిపిస్తుంది. వంట మాస్టార్లనూ అభినందించేలా చేస్తుంది. వంటకాల్లో అంతటి మహిమగల ఉప్పు ఎక్కడ ఉత్పత్తి అవుతుంది?. సాగుదారులు ఎవరు? వారి సాధక బాధకాలు ఏమిటి!? ఆ అంశాలన్నీ క్రోడీకరిస్తూ ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

అల్లూరు, సెప్టెంబరు 21 : ప్రతి పంటకూ ఓ సీజన్ ఉంటుంది. సీజన్ ఆధారంగానే వ్యవసాయ దిగుబడులు, నాణ్యత, ధరలు ఆధారపడి ఉంటాయి. కానీ ఉప్పు రైతుల పరిస్థితి అలా ఉండదు. ప్రకృతిపై ఆధారపడి ఉత్పత్తి చేసే ఉప్పు సాగుదారులకు అప్పుడప్పుడు ఆ ప్రకృతే శాపంగా మారుతుంటుంది. ఉమ్మడి జిల్లాలోని కావలి నుంచి తడ తీరం వరకు ఏడు మండలాల్లోని సుమారు 45 వేల ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి అవుతోంది. కావలి రూరల్ మండలం, అల్లూరు, విడవలూరు, బోగోలు తదితర మండలాల్లో 50 వేల మంది కుటుంబాలు ఉప్పు ఉత్పత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రకృతిలో చోటు చేసుకునే మార్పు చేర్పులపై ఉప్పు ఉత్పత్తి ఆధారపడి ఉంటుంది. ఏటా జనవరి నుంచి వర్షాలు ఉండవు కాబట్టి రైతులు ఉప్పు ఉత్పత్తికి పూనుకుంటారు. ప్రతిరోజూ నిద్రలేచి చద్దెన్నం కట్టుకుని భార్యాభర్తలిద్దరూ ఉప్పు కయ్యల్లోకి వెళ్లి మధ్యాహ్నం వరకు కష్టపడతారు. కాస్త విరామం తర్వాత మళ్లీ అదే పని కొనసాగిస్తూ తమ స్వేదాన్ని ఉప్పు ఉత్పత్తి కోసం పెట్టుబడిగా పెడతారు. భానుడు ఉంటేనే ఉప్పు ఉత్పత్తి జరుగుతున్న క్రమంలో అర్థంతరంగా వరుణుడు ఆగ్రహిస్తే మాత్రం ఆశలన్నీ నీటిపాలవుతాయి.

● దిక్కులేని ఉప్పు రైతులు

సాధారణంగా ఉప్పు ఉత్పత్తికి 20 నుంచి 25 రోజుల సమయం పడుతుంది. సముద్ర తీరంలో బోర్ల ద్వారా నీటిని తోడి కయ్యల్లో ముందుగా సిద్ధం చేసుకున్న గడుల్లో (గంజేరు) నింపుతారు. వారం రోజులపాటు ఎండకు బాగా ఆరనిచ్చి ఆ తర్వాత ఆ నీటిని మరో కయ్యలోకి మార్పు చేస్తారు. వారం, పది రోజుల్లో ఉప్పు ఉత్పత్తి అవుతుంది. అయితే, అన్ని పంటలకు నష్టాలు వాటిల్లితే వాటిని అంచనాలు వేసి అవసరమైన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వాలు చేస్తుంటాయి. కానీ ఉప్పు రైతుకు మాత్రం అలాంటి సహకారాలు అందవు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తమకు తీరని నష్టం వాటిల్లిందని పత్రికల ద్వారా సాగుదారులు ఘోషించినా కన్నెత్తి చూసేవారు లేరు.

● పథకాలు, సౌకర్యాలు లేక..

ఉప్పు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు, రుణాలు లేవు. పగలంతా ఎర్రటి ఎండలో చెమటలు చిందించి ఉత్పత్తి చేసే ఉప్పును చివరకు నిల్వ ఉంచుకునేందుకు సరైన వసతులు లేవు. గతంలో వీరికోసం ప్రత్యేక ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హయాంలో అప్పటి పాలకులు హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. వ్యవసాయ రైతులకు ఇచ్చేవిధంగానే తమకూ బ్యాంకు రుణాలు అందచేసి సంక్షేమ పథకాలు అవసరమైన వసతులు కల్పించాలని కోరుతున్నారు.

● ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి

ఉప్పు అంతర్జాతీయస్థాయిలో జరిగే వ్యాపారం. అయినా ఉత్పత్తిదారుల్లో ఏమాత్రం ఆ వైపు ఆలోచన లేదు. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఉప్పును తరలిస్తుంటారు. అయితే గిట్టుబాటు ధర మాత్రం ఉండడం లేదు. వేసవిలో ఉత్పత్తి చేసే ఉప్పును వర్షాకాలంలో విక్రయించుకోవడం ఆనవాయితీ. ఆ సమయంలో ఉత్పత్తి అంతగా ఉండని కారణంగా నిల్వ చేసిన ఉప్పును కొనుగోలు చేసేందుకు వ్యాపారులు వస్తారు. అప్పుడు కూడా వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించాల్సి ఉంది.

● ఊరిస్తున్న ధరలు

ఎన్ని కష్టాలు కుంగదీసినా గడిచిన మూడేళ్లుగా ఉప్పు రైతులు కోలుకునే అవకాశం ఏర్పడింది. ఈ కాలంలో ధరలు కొంతమేర ఆశాజనకంగా మారాయి. క్వింటం రూ.60 నుంచి 90 వరకు పలుకుతున్న ధరలు ప్రస్తుతం రూ.300 నుంచి 450 వరకు పలుకుతోంది. సాధారణంగా ఒక ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తికి రూ.35 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరాలో 3 టన్నుల వరకు ఉత్పత్తి అవుతుంది. ఇప్పుడు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని సాగుదారులు చెబుతున్నారు.



ఉప్పు రైతులను గుర్తించాలి



ప్రభుత్వాలు ఉప్పు రైతులను గుర్తించాలి. మేము పడుతున్న కష్టాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక పథకాలను అమలు చేయాలి. ఇప్పటివరకు ఎటువంటి పథకాలు లేవు.. రుణాలు లేవు. కేంద్రం చర్యలు చేపట్టి ఉప్పు రైతులను గుర్తించి సహకరించాలి.

- గోళ్ళ ఆదాం, గోగులపల్లి

మార్కెట్ స్థిరత్వం కల్పించాలి



అన్ని రకాల పంటలకు ప్రత్యేక మార్కెట్ కల్పించినట్లుగానే ఉప్పు రైతులకు కూడా మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి. మార్కెట్ స్థిరత్వం లేక ఇబ్బందులు పడుతున్నాం. దళారులు అడిగే ధరకే విక్రయించాల్సి వస్తోంది. లేకుంటే కుప్పలు అలాగే ఉంచుకోవాల్సి వస్తుంది.

- గోళ్ళ విజయకుమార్, గోగులపల్లి

ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు



ఎన్ని కష్టాలు వచ్చినా కూడా ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదు. ఎంతమంది అధికారులకు, నాయకులకు మా గోడు వినిపించుకున్నా పట్టించుకోలేదు. అవసరానికి మమ్మల్ని వినియోగించుకోవడమే తప్ప మాకు ఉపయోగపడే ప్రభుత్వాలు లేకుండా పోయాయి.

- కిష్టయ్య

ఎల్లకాలం ఇవే బతుకులు



మేము చిన్నతనం నుంచి ఇవే బతుకులు బతుకుతున్నాం. అవే కష్టాలు, అవే బాధలు. స్థిరత్వం లేని జీవితాలు మావి. ప్రకృతి వైపరీత్యాలతో సంభవించే నష్టాలను ఎవరూ చూడడం కూడా లేదు. ఎవరికి చెప్పినా ఆలకించడం లేదు.

- సూరిశెట్టి సుబ్బయ్య.

నేడు సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీ కౌన్సెలింగ్



జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన హరివర్మ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 21 : జిల్లాలో ఒకేచోట రెండేళ్లు పని చేసిన సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ సహాయకుల బదిలీకి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారం గుంటూరులోని స్టాంపులు - రిజిస్ట్రేషన్లశాఖ ప్రధాన కార్యాలయంలో జరుగుతోంది. దీంతో జిల్లాలో పెద్ద సంఖ్యలో సబ్ రిజిస్ట్రార్‌లు, సీనియర్ సహాయకులు బదిలీ కానున్నారు.

● ముగిసిన కౌన్సెలింగ్.. 33 మంది బదిలీ

స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ సహాయకులు, ఆఫీస్ సబార్డినేట్‌లు, షరాబుల బదిలీకి సంబంధించిన కౌన్సెలింగ్ శనివారం రాత్రి ముగిసింది. ఈ కౌన్సెలిం గ్‌లో 20 మంది జూనియర్ సహాయకులు, 12 మంది ఆఫీసు సబార్డినేట్‌లు, ఒక షరాబును జిల్లాలోని వివిధ కార్యాలయాలకు బదిలీ చేశారు. ఈ బదిలీల కౌన్సెలింగ్‌కు చైర్మన్‌గా జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ హరివర్మ, సభ్యుడిగా ఒంగోలు రిజిస్ట్రార్ బాలంజనేయులు వ్యహరించారు.

● జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా హరివర్మ

స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా సీఎస్ హరివర్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా మార్కెట్ వాల్యూ, ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

'ఎక్సైజ్'లో సీఐడీ గుబులు

చేసుకున్నోళ్లకు చేసుకున్నంత.. అని పెద్దలు ఊరకే అనలేదు. మనం ఏ రకంగా వ్యవహరిస్తామో.. ఖర్మఫలం కూడా మనల్ని అదే రకంగా పరిగణిస్తుందన్నది సత్యం. ఇప్పుడు ఎక్సైజ్ శాఖలో కూడా అదే జరుగుతోంది. ఎన్నికల ముందు వరకూ వైసీపీ నేతల ఆదేశాలే శిరోధార్యం అన్నట్లుగా కొందరు అధికారులు వ్యవహరించగా.. ఇప్పుడు ఆ తీరే వారికి కునుకు లేకుండా చేస్తోంది. ఎప్పుడు సీఐడీ విచారణ మొదలవుతుందా? మొదలయ్యాక తమ పరిస్థితి ఏమిటి!? అన్న గుబులు వైసీపీ వీరభక్త అధికారుల్లో నెలకొంది.

● ఎన్నికల్లో వైసీపీ నేతలకు మద్యం సరఫరా
● వేళ్లన్నీ ఓ ఉన్నతాధికారి వైపే!
● విచారణ ఆపేందుకు విస్తృత ప్రయత్నాలు
● ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
● మళ్లీ జిల్లాలో కొనసాగేందుకు లాబీయింగ్

నెల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి విచ్చలవిడిగా మద్యాన్ని వైసీపీ నేతలకు చేరవేశారు. దీనివెనుక ఓ అధికారి కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే వెంకటాచలం, పొదలకూరు మండలాల్లో భారీగా మద్యం డంప్‌లను పట్టుకున్నారు. వేల కొద్దీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో ఎక్సైజ్ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇందుకు బాధ్యులుగా కొన్ని దుకాణాల్లోని సిబ్బందిని తొలగించి చేతులు దులుపుకున్నారు. అయితే దీని వెనుక భారీ కుట్ర ఉందని టీడీపీ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. కానీ ఆ దిశగా విచారణ జరగలేదు. ఒక్క సర్వేపల్లిలోనే సుమారు 1.40 లక్షల మద్యం సీసాలను వైసీపీ నేతలకు చేరినట్లు ప్రాథమికంగా ఆధారాలు సంపాదించారు. ఇదే స్థాయిలో జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతలకు అక్రమ మార్గంలో మద్యం సరఫరా జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికల నాటి మద్యం అక్రమ వ్యవహారాలు తెరమీదకు వచ్చాయి. ఇటీవలే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి ఎన్నికల్లో జరిగిన మద్యం అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐడీ విచారణకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏ క్షణమైనా సీఐడీ విచారణ మొదలుకావచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.



● సార్.. ఆదుకోండి ప్లీజ్!

ఎక్సైజ్ అధికారుల పాత్ర, ఆదేశాలు లేకుండా ప్రభుత్వ మద్యం దుకాణాలు, డిపో నుంచి భారీస్థాయిలో మద్యాన్ని వైసీపీ నేతలకు చేరవేయడం సాధ్యం కాదన్నది బహిరంగ రహస్యం. అయితే ఆ అధికారులు ఎవరన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. ఎక్సైజ్ శాఖలోని ఓ అధికారిపైనే వేళ్లన్నీ చూపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు జిల్లాకు వచ్చిన సదరు అధికారి అప్పటి బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డికి అత్యంత సన్నిహితుడన్న పేరుంది. ఈ ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు కూడా ఉన్నట్లు ఎక్సైజ్ శాఖలో ప్రచారం నడుస్తోంది. ఇప్పుడు వాసుదేవరెడ్డి మెడకు ఉచ్చు బిగుసుకుంది. సీఐడీ కేసులు కూడా నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో జిల్లాలో విచారణ జరిపితే ఎక్కడ తన మెడకు కూడా ఉచ్చు బిగుసుకుంటోందనన్న భయంతో జిల్లాలోని సదరు అధికారి తెరవెనుక రాజకీయం మొదలుపెట్టారు. సీఐడీ విచారణ జరగకుండా శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. తన తండ్రిని వెంట బెట్టుకొని జిల్లాలోని ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నాడు వైసీపీ నేతల ఒత్తిళ్లతో తప్పు జరిగిపోయిందని, దీనిని మనసులో పెట్టుకో కుండా విచారణ ఆపించాలంటూ వేడుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అదే సమయంలో రాజధాని ప్రాంతంలోని తన సొంత జిల్లా నుంచి కొందరు ఎమ్మెల్యేల ద్వారా కూడా జిల్లాలోని ఎమ్మెల్యేలకు ఫోన్లు చేయిస్తున్నారు. ఇలా ఓ వైపు సీఐడీ విచారణ నిలుపుదల చేయించుకునే పని చేస్తూనే మరోవైపు జిల్లాలోనే కొనసాగేందుకు కూడా ముమ్మరంగా ప్రయత్నిస్తు న్నట్లు సమాచారం. అందుకుగానూ రాష్ట్ర స్థాయిలో కీలకమైన ఇద్దరు ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సు కూడా చేయించు కున్నట్లు తెలిసింది. జిల్లాలోనే కొనసాగేందుకు హామీ కూడా లభించినట్లు ఎక్సైజ్ వర్గాలు చెప్పుకుం టున్నాయి.

27 నుంచి స్కూల్ గేమ్స్ క్రీడా జట్ల ఎంపికలు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 21 : జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ క్రీడాంశాల్లో అండర్-14 క్రీడాజట్ల ఎంపికల తేదీలు ఖరారుచేస్తూ శనివారం డీఈఓ రామారావు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 27వ తేదీన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, సాఫ్ట్ టెన్నిస్, మోడర్న్ పెంటాథలిన్, పెనుబల్లి జడ్పీ పాఠశాలలో బాక్సింగ్, కావేరి నగర్ టెన్నిస్ అకాడమీలో టెన్నిస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 28న టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్, రోప్ స్కిప్పింగ్, ఖోఖో, తైక్వాండో, రగ్బీ, యోగా పోటీలను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, ఫెన్సింగ్ రెయిన్‌బో పాఠశాలలో, నెట్‌బాల్‌ను బుచ్చి బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తారు. 30న ఆర్చరీ, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, బేస్‌బాల్, సైక్లింగ్ ఎంపికలను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోనూ, నెల్లూరు క్లబ్‌లో క్యారమ్స్‌ను నిర్వహిస్తారు. అక్టోబరు 1వ తేదీన ఏసీ స్టేడియంలో ఫుట్‌బాల్, కబడ్డీ, త్రోబాల్, టెన్నికాయిట్, కరాటే, షూటింగ్, జిమ్నాస్టిక్స్, సెపక్‌తక్రా, సాఫ్ట్‌బాల్ ఎంపికలను, 3వతేదీన వాలీబాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలుంటాయని డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విజయ, పీఈటీలు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ జీఎంగా మారుతీప్రసాద్

● కర్నూలుకు సుధాకర్ బదిలీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 21: జిల్లా పరిశ్రమల శాఖ జీఎంగా మారుతీప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జీఎంగా విధుల్లో ఉన్న సుధాకర్‌ను కర్నూలుకు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో కర్నూలు జీఎం మారుతీప్రసాద్‌ను నెల్లూరు జీఎంగా బదిలీ చేశారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈయన గతంలోనూ నెల్లూరులో జీఎంగా పనిచేశారు.

నకిలీ పోలీసుల గుట్టు రట్టు

● నలుగురి అరెస్ట్, రూ.21.21 లక్షల స్వాధీనం

నెల్లూరురూరల్ : ముత్తుకూరు వద్ద పోలీసుల మంటూ వాహన తనిఖీల పేరిట కారులోని రూ.50 లక్షలు అపహరించుకు వెళ్లిన నలుగురు నకిలీ పోలీసుల గుట్టు రట్టైంది. జిల్లాలో సంచలనంగా మారిన ఈఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసు శాఖ ఒక్క రోజు వ్యవధిలో నకిలీ పోలీసులను అదుపు లోకి తీసుకుని వారి నుంచి రూ.21.21 లక్షలు నగదు, ఖరీదైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు శనివారం రూరల్ పోలీసు స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. అల్లూరు మండలం ఇస్కపల్లికి చెందిన షేక్ హాసన్, జానీబాషా, బీద రవీంద్ర, న్యూ డిల్లీకి చెందిన మహ్మద్ ఇర్షాద్‌లు ముఠాగా ఏర్పడి ఉస్మాన్ అనే వ్యక్తికి ముత్తుకూరులో పొలం తక్కువ ధరకు ఇప్పిస్తామని రప్పించారు. కారులో రూ.50 లక్షలు తీసుకువస్తున్న ఉస్మాన్ ఏపీ జెన్‌కో రోడ్డు వద్దకు వచ్చేసరికి పోలీసుల మంటూ కారును తనిఖీ చేశారు. ముందస్తు పథకం ప్రకారం అందులో రూ.50 లక్షలతో ఉన్న బ్యాగును అపహరించుకువెళ్లారు. తనిఖీ చేసిన నకిలీ పోలీసులని తెలుసుకున్న బాధితుడు ముత్తుకూరు పోలీ సులకు ఫిర్యాదు చేయగా వారు రంగంలోకి దిగి నెల్లూరు రూర ల్, కోవూరు, రూరల్ సర్కిల్ పోలీసులతో దర్యాప్తు ప్రారంభిం చారు. సాంకేతికత ఆధారంగా నిదితులంతా విదేశాలకు పరార య్యేందు సిద్ధపడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వారి నుంచి ఖరీదైన జాగ్వార్ కారు, బొలెరో కారు, నగదు లెక్కింపు యంత్రాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిం చారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ కృష్ణకాం త్ అభినందించారని, రివార్డుల కోసం సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 21 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు నూతన సాంకేతిక పద్ధతులను తెలియచేయడంతోపాటు చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాలు జరిగే ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖతోపాటు అనుబంధ శాఖల అధికారులు పాల్గొని క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి, జిల్లా మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు, మార్కెటింగ్ ఏడీ అనిత, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మా వంతుగా..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) సెప్టెంబరు 21: 'నా సేన కోసం నా వంతు'గా జనసేనాని పిలుపుతో జిల్లా జనసైనికులు కదలిరు. విజయవాడలో వరద బాధితుల కోసం భారీగా విరాళం ప్రకటించారు. జనసేన పార్టీ జిల్లా పరిశీలకుడు వేములపాటి అజయకుమార్ సమక్షంలో శనివారం మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రూ.21.5 లక్షల విరాళం అందించారు. జనసేన పార్టీ జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ రూ.10 లక్షలు, వేములపాటి అజయకుమార్ రూ.2 లక్షలు, బోనబోయిన ప్రసాద్ రూ.2 లక్షలు, బోగినేని కాశీరావు రూ.2 లక్షలు, జంపాల ప్రకాష్ రూ.2 లక్షలు, కొణిదల గిరీష్ రూ.2 లక్షలు, గుమ్మినేని వాణి భవాని రూ.1.5 లక్షలు విరాళాలు అందజేశారు.



నెల్లూరు : పవన్‌కల్యాణ్‌ను కలిసిన మల్లికార్జున యాదవ్

● **బుచ్చిరెడ్డిపాళెం :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని అపుస్మా నాయకుల ఆధ్వర్యంలో రూ.7,34,071 విరాళాలు సేకరించి సీఎం సహాయ నిధికి అందజేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు నేల నూతల శ్రీధర్ తెలిపారు. సేకరించిన విరాళా లను శనివారం బుచ్చి వివేకానంద పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా నేతలు దయాకర్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, రాధిక, రామసుబ్బారెడ్డి, అయూబ్‌ఖాన్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : శ్రీధర్‌కు విరాళాలు ఇస్తున్న అపుస్మా నాయకులు

కేజీ వీల్స్... ఇక రోడ్డుపై థ్రిల్స్



ఇది సంగం మండలంలోని అన్నారెడ్డిపాళెం తారు రోడ్డు. ముంబయి జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు 3 కిలో మీటర్ల దూరం ఉంది. ఈ రహదారికి ఓవైపు వరి పొలాలు ఉండడంతో రైతులు బురద దుక్కులు చేసేందుకు ఇంటి వద్దనే ట్రాక్టర్‌కు కేజీ వీల్స్ తగిలించి రహదారిపై నడపడంతో తారురోడ్డు ఛిద్రమైంది. అసలే నిధుల కొరతతో రహదారులు వేసే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు బాధ్యతారాహిత్యంతో వ్యవహరించడంతో రహదారి రూపు కోల్పోయింది.

\- సంగం

కేన్సర్‌తో మృత్యు ఘంటికలు!



- జిల్లాలో 13 వేల మందికి పైగా రోగులు
- ఏటా పదుల సంఖ్యలో మరణాలు
- పొగాకు ఉత్పత్తుల వినియోగమే కారణం
- నేడు కేన్సర్ బాధితుల సాంత్వన దినం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 21 : జిల్లాలో కేన్సర్ మహమ్మారి కారణంగా ఏటా పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా, కమ్యూనిటీ డిసీజెస్ కింద వారికి అందుతున్న వైద్యంపై వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి పెట్టినా, వ్యాధికి గురైన వారు చికిత్స కోసం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా మృత్యువు నుంచి తప్పించుకోలేకున్నారు. ఇదిలా ఉంటే కెనడాకు చెందిన కేన్సర్ వ్యాధిగ్రస్తుడు మెలిండా రోజ్ 1996 సెప్టెంబరు 22వ తేదీన మృతి చెందారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ కేన్సర్ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకునేందుకు మెలిండా రోజ్ మృతి చెందిన రోజును ప్రపంచ రోజ్ డేగా నిర్వహిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ కూడా ఇదే రోజు కేన్సర్‌తో మరణించిన వారిని స్మరించుకుంటూ కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తోంది.

● జిల్లాలో 13 వేల మందికి పైగా వ్యాధిగ్రస్థులు

ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించలేక పోవడం, సకాలంలో సరైన వైద్యం అందకపోవడంతో జిల్లాలో కేన్సర్ వ్యాధి చాప కింద నీరులా విస్తరిస్తోంది. మద్యపానంతో పాటు పొగాకు ఉత్పత్తులు వినియోగించే వారి సంఖ్య పెరిగిపోవడంతో ప్రస్తుతం జిల్లాలో 13 వేల మందికి పైగా కేన్సర్ రోగులు ఉన్నారు. వీరంతా వ్యాధి రెండో దశకు చేరుకున్న వారే. అందరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోకపోవడంతో వెలుగులోకి రానివారు మరెందరున్నారో. గుట్కా, ఖైనీ, జరదా వంటి పొగాకు ఉత్పత్తులకు బానిసలుగా మారడం వల్ల దవడ, నాలుక, స్వరపేటిక వంటి నోటి కేన్సర్ వస్తోంది. పొగాకు ఉత్పత్తులు తినరాదనని, దీనివల్ల కేన్సర్ వస్తుందంటూ ప్రచారానికే ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేస్తున్నా సరైన నియంత్రణ లేకపోవడంతో కేన్సర్ బాధితుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఇక బ్రెస్ట్, స్త్రీ సంబంధిత కేన్సర్ రోగులు కూడా ఎక్కువగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా సురక్షితం గాని లైంగిక సంబంధాల వల్ల మహిళల్లో గర్భాశయ ముఖద్వారం కేన్సర్ బాధితులు పెరుగుతోన్నారు. ఇలాంటి వైరల్ కేన్సర్ వ్యాధి మాత్రం నయం చేయవచ్చని, ఇతర అవయవాలకు సోకిన కేన్సర్ మాత్రం నివారణ కష్టతరమని వైద్యనిపుణులు అంటున్నారు.

మరణించిన వారిని స్మరించుకుంటూ..



కేన్సర్ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకుంటూ ఏటా సెప్టెంబరు 22వ తేదీన ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో భాగంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నాం. జిల్లాలో 300 మంది కేన్సర్ రోగులను గుర్తించి వారికి వైద్య చికిత్స అందేలా కృషి చేస్తున్నాం. రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిలో ఎందరో రోగులకు చికిత్స అందేలా పాటుపడుతున్నాం. కేన్సర్ వ్యాధి వస్తే ఇక మరణానికి చేరువవుతారన్న విషయం అలా ఉంచితే ఎందరో రోగులు కేన్సర్ నుంచి కోలుకుని సాధారణ జీవితం గడుపుతున్నారు.

\- డాక్టర్ సుధీర్‌కుమార్, ఎన్‌సీడీ పోగ్రాం అధికారి

● అందుతున్న చికిత్స

జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ విభాగంతో పాటు మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కూడా కేన్సర్‌కు ప్రత్యేక విభాగం ఉంది. మరికొంత మంది తిరుపతి స్విమ్స్, హైదరాబాద్‌లో ఉన్న బసవతారకం కేన్సర్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఎంతో మంది వైద్య చికిత్స చేయించుకుంటున్నారు. రెడ్‌క్రాస్ ద్వారా ప్రతి ఏటా 5 వేల మందికి పైగా వైద్యం అందుతోంది. అయితే ఈ మహమ్మారి నుంచి తప్పించుకోవాలంటే అవగాహన ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

● 4.045 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం



గంజాయి విక్రయ నిందితులు, ప్యాకెట్లతో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

కావలి, సెప్టెంబరు 21: స్థానిక బుడంగుంటకు చెందిన గోసల గోపీక్రిష్ణ, అల్లాడి మణి, మునునూరు సుదర్శి అన్వేష్‌లను గంజాయి కేసులో అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.045 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు, ఎస్‌ఐ సీహెచ్. తిరుమలరెడ్డితో కలిసి డీఎస్పీ అరెస్టు వివరాలను వెల్లడించారు. కావలి రూరల్ పోలీసులు ఈ నెల 18న గంజాయి గురించి తెలిసిన సమాచారం మేరకు ఉన్నతాధికారులు, తహసీల్దారుకు తెలిపి రెవెన్యూ సిబ్బందితో బుడంగుంట జగనన్న కాలనీకి వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో కాలనీలో 2వ లైనులో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో రెండు గంజాయి ప్యాకెట్లు ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 20న మధ్యాహ్నం 2:30గంటలకు నిందితుల వివరాల సమాచారం పోలీసులకు రావటంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ శ్రీధర్ పర్యవేక్షణలో సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐ తిరుమలరెడ్డి వారి సిబ్బందితో కలిసి కావలి-ఉదయగిరి రోడ్డులోని బుడంగుంట రోడ్డు జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ వీరిని చూచి ముద్దాయిలు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా వారిని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించారు. చెడు వ్యసనా లకు బానిసలై విశాఖ జిల్లా పాడేరు ఏజెన్సీప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముద్దాయిలను అరెస్టు చేసిన వారిలో సీఐ, ఎస్‌ఐలతో పాటు రూరల్ పోలీస్ సిబ్బంది రాదయ్య, రాజేష్, ప్రసాద్, అయోధ్యకుమార్, ఇర్షాద్ పాల్గొన్నారు.

ఆల్తుర్తిలో రెండిళ్లు దగ్ధం



పొదలకూరు: మండలంలోని ఆల్తుర్తి ఎస్టీ కాలనీలో శనివారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఇండ్ల పెంచలయ్య, గడ్డం సంజీవయ్య కూలీ పనులుకెళ్లి ఇంటి బయట ఉండగా ఒక్కసారిగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. దీంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసేలోపే రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని బాధితులు భావిస్తున్నారు.

మోటార్లు ధ్వంసం చేసి రాగి తీగ చోరీ

ముత్తుకూరు, సెప్టెంబరు 21: మండలంలోని కుమ్మరమిట్టలో శనివారం చేపల చెరువు వద్ద ఉన్న మోటార్లను ధ్వంసం చేసి, అందులోని రాగి తీగను చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు, కుమ్మరమిట్టకు చెందిన మర్లపాటి ప్రవీణ్‌కుమార్‌కి చెందిన చేపల చెరువు వద్ద ఉన్న రెండు మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని విలువైన రాగి తీగను దొంగలించారు. బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఇంట్లో..

● బంధువులపై ఫిర్యాదు

ఏఎస్‌పేట, సెప్టెంబరు 21: తన ఇంట్లో నగదును సొంత బంధువులే చోరీ చేశారని ఓ వృద్ధురాలు శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్‌పేట దర్గా తూర్పు వీధికి చెందిన వృద్ధురాలు హబీబా దర్గా వద్ద యాచిస్తూ జీవనం సాగిస్తోంది. యాచించగా వచ్చిన నగదుతో పాటు పింఛను నగదును ఆమె ఇంట్లో దాచి ఉంచేది. ఈనేపథ్యంలో శనివారం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని దుస్తులు చిందరవందరగా ఉండడం గమనించి చూడగా తాను దాచుకున్న సుమారు లక్ష రూపాయల నగదు, వెండి గొలుసులు కనబడలేదని, ఇది తమ బంధువుల పనేనని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరుపుతున్నామని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 21: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పెద్దబజారు కుమ్మరవీధిలో నివాసం ఉంటున్న సయ్యద్ ఈనెల 17వ తేదీన బైక్‌పై బారకాస్ సెంటర్ వైపు వెళుతుండగా ఓ మహిళ అకస్మాత్‌గా రోడ్డు దాటగా సయ్యద్ సడన్ బ్రేక్ వేశారు. దీంతో ఆ మహిళ అతనితో గొడవపడింది. ఈ క్రమంలో ఈనెల 19వ తేది రాత్రి ఆయన మసీదుకు నడిచి వెళుతుండగా కలెక్టర్ ఆఫీసు గేటు వద్ద ఆ మహిళ అతనిని ఫొటోలు తీసింది. ఈ విషయాన్ని గమనించిన సయ్యద్ ఎందుకు ఫొటోలు తీస్తున్నారని ప్రశ్నించగా ఐదు నిమిషాలుంటే మావాళ్లు వచ్చి చెబుతారంది. సయ్యద్ మసీదుకు వెళ్లి తిరిగి బయటకు రాగా టీ అంగడి వద్ద వేచి ఉన్న ఆ మహిళ భర్త, మరికొందరు నా భార్యను ఎందుకు దుర్భాషలాడావంటూ అతనిపై దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు శుక్రవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశ్నించినందుకు దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 21: పుట్టిన రోజు వేడుకల పేరుతో రచ్చ రచ్చ చేస్తున్న వ్యక్తులను ప్రశ్నించినందుకు ఆ వ్యక్తితో పాటు అతని తమ్ముడుపై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నావాబుపేట మసీదు సెంటర్ సమీపంలో శుక్రవారం రాత్రి అబ్దుల్, మున్నా, ఫయాజ్ మరికొందరు తమ స్నేహితుడు ముజ్జు పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ క్రమంలో బాణాసంచా కాల్చడంతో పాటు, పెద్ద ఎత్తున రచ్చ చేశారు. అదే ప్రాంతానికి చెందిన ముత్తహర్ ఎందుకు రచ్చ చేస్తున్నారని వారిని ప్రశ్నించగా ఆగ్రహించిన అబ్దుల్, మున్నా, ఫయాజ్, మరికొందరు అతనిపై, అడ్డొచ్చిన అతని తమ్ముడుపై ఇనుమరాడ్‌తో దాడి చేశారు. ఈ మేరకు బాధితులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధిపులతోనే మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 21: స్వర్ణాల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన హుసునూరా భర్త వేధింపులతోనేన ఈ ఘటనకు పాల్పడిందని పోలీసు విచారణలో వెల్లడైంది. పోలీసుల కథనం మేరకు.. ఖుదూస్‌నగర్‌కు చెందిన అబ్దుల్ వహీద్, హుసునూరా(29) దంపతులు. వారికి ఇద్దరు సంతానం. వహీద్ చికెన్‌స్టాల్‌లో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. దంపతుల నడుమ విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీన బారాషాహీద్ దర్గా సమీపంలోని స్వర్ణాల చెరువులో ఆమె మృతదేహం లభ్యమైంది. దర్గామిట్ట పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భర్త వేధింపులతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని తేలడంతో కేసు మార్పు చేశామని దర్గామిట్ట పోలీసులు తెలిపారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమజంట

పొదలకూరు, సెప్టెంబరు 21 : ప్రేమ వివాహం చేసుకుని రక్షణ కల్పించాలంటూ, నూతన వధూవరులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. చేజర్ల మండలం ఎన్‌వీ.కంద్రిగకి చెందిన మహిత (22), పొదలకూరులోని గేట్ సెంటర్‌కి చెందిన నవీన్ (24) కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేర్వేరు కావడంతో పెద్దలు అంగీకరించరని తెలిసి ప్రేమపెళ్లి చేసుకున్నారు. ఇద్దరు కూడా మేజర్లు కావడంతో శనివారం పోలీసులను ఆశ్రయించారు. అమ్మాయి తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందంటూ నవీన్ రక్షణ కోరారు. దీంతో పోలీసులను ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి నూతన వధూవరులను ఇంటికి పంపారు.



పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7160
వెండి కిలో ధర	రూ. 91,400
వెండి ఒక గ్రాము	రూ. 94.40

రైతుల కష్టం దళారుల పాలు

కొడవలూరు: పంటల సాగులో రోజురోజుకు ఖర్చులు పెరుగుతున్నాయి. పండించిన పంటను మార్కెట్‌లో విక్ర యించాలంటే మద్దతు ధర లభించడం లేదు. దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతుల కష్టాన్ని దోచుకుంటు న్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా ధాన్యాన్ని పుట్టికి రూ. 1000 నుంచి రూ. 2500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ దుస్థితి మండలంలో నెలకొంది. మండ లంలో 17,500 హెక్టార్ల పొలం ఉండగా, 1,150 హెక్టార్లలో బోరు బావుల కింద వరి సాగు చేశారు. ఎకరా వరి సాగు కు సుమారు రూ.35,000 ఖర్చు అవుతుంది. వాతావర ణంలో మార్పుల కారణంగా దిగుబడి తగ్గి ఎకరాకు రెండు నుంచి మూడు పుట్లు మాత్రమే పండు తున్నాయి. దీనికితోడు దళారులు ధర తగ్గించి కొంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.

విద్యార్థులతోనే ఆరోగ్యకర సమాజం : డీఈవో

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 21 : విద్యార్థులతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే.రామారావు అన్నారు. జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్షల ఆధ్వర్యంలో నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, సమగ్రశిక్ష సీఎంవో పెంచలయ్య, ఏపీవో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన అజీజ్

నెల్లూరు(వైద్యం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజాదర్బారులో పాల్గొన్న చంద్రబాబును టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ కలిశారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీతో కలిసి అక్కడకు వచ్చిన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భూపంపిణీలో అవకతవకలను పరిశీలిస్తున్నాం : జేసీ



జేసీతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 21 : గత ప్రభుత్వ హయాంలో పేదల భూపంపిణీలో జరిగిన అవకతవకలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో మలోలాతో కలిసి రెవెన్యూ అధికారులతో జేసీ మాట్లాడారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు జేసీతో మాట్లాడారు. మండలంలోని ఎర్రబల్లి, బత్తులపల్లి, మరుపూరు, ప్రభగిరిపట్నం, వావింటపర్తి గ్రామాల్లో పేదల భూపంపిణీల అక్రమాలు జరిగాయని, ఆధారాలతోసహా ఇప్పటికే లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని, అలాగే కలెక్టర్‌కు కూడా గతంలో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. జేసీ స్పందిస్తూ ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారిస్తున్నామని, విచారణ అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సారంగపాణి, డీటీ శివకృష్ణ, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ అపవిత్రతపై టీడీపీ నిరసన



ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 21 : తిరుమల లడ్డూ అపవిత్రతపై టీడీపీ ఆధ్వర్యంలో నల్లదుస్తులు ధరించి టీడీపీ నేతలు శనివారం నెల్లూరు నగరంలోని నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీసెల్ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలపడం కలిచి వేస్తుందన్నారు. ఎంతో మంది హిందువులు ప్రత్యక్ష దైవంగా కొలుస్తున్న వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కల్తీ చేయడం దుర్మార్గమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చర్యల వల్ల కమీషన్లకు కక్కుర్తి పడి ఇలా అక్రమాలకు పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ దోషులు ఎంతటి వారైనా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నేత రేవతి, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఔషధాల ఉత్పత్తి అవసరమే : వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం, సెప్టెంబరు 21: పర్యావరణానికి హాని లేకుండా నాణ్యమైన ఔషధాలను ఉత్పత్తి చేయడం అవసరమేనని వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయ భాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం ఔషధ పరిశ్రమలో గ్రీన్ కెమిస్ట్రీపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలను ఔషధ పరిశ్రమలో అనుసరించడం ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణలో అది ఎంతటి కీలకపాత్ర పోషిస్తుందో వివరించారు. పర్యావరణహితం, సురక్షితమైన ఔషధ ఉత్పత్తి ప్రక్రియలు, సేంద్రీయ రసాయనశాస్త్రంలో తాజా పరిణామాలపై చర్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, టీ వీరారెడ్డి, ఎల్.రమేష్, ఏజీ దాము, ఉమావెంకటసతీష్, వై.విజయ, డాక్టర్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ విజయ భాస్కర్ రావు

నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 21 : వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న జిల్లాకు చెందిన వేద విద్యార్థులు నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోవాలని దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిరుద్యోగ వేద విద్యార్థికి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి లభిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థులు అభ్యర్థి పేరు, చిరునామా, ఆధార్‌నెంబరు, వేద విద్య అర్హత వివరాలు, ఎక్కడ ఉద్యోగం చేయడం లేదని స్వీయ వాగ్మూలం, ఇతర వివరాలతో పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. పూర్తి వివరాలకు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు డీకేడబ్ల్యూలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 21: నెల్లూరు నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్రం, ఆక్వాకల్చర్ డిపార్ట్‌మెంట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రింప్ ప్రాసెసింగ్ టెక్నాలజీపై సర్టిఫికెట్ కోర్సును ఈనెల 23వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఆక్వా రంగంలో అనేక ఉపాధి అవకాశాలు కలిగిన ప్రింప్ ప్రాసెసింగ్ టెక్నాలజీ కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన మహిళలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివ రాలకు ఫోన్ 9391321150ను సంప్రదించాలని తెలిపారు.

ప్రజలు మెచ్చుకునేలా కూటమి ప్రభుత్వ పాలన

● టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



మాట్లాడుతున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 22 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన ప్రజలు మెచ్చుకునేలా ముందుకు పోతుందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చెప్పారు. గరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలసి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నారని తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం అని, కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సామాజిక పింఛన్ రూ.4వేలకు పెంచడం, పోలవరం నిర్మాణం తిరిగి ప్రారంభించడం, టీటీడీ ప్రక్షాళన, అన్న కాంటీన్లు పునఃప్రారంభించడం, అన్ని వ్యవస్థల అభివృద్ధి కి చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. వరదల సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేసిన విధానం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ సిక్సులో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంటుని కూటమి ప్రభుత్వం కాపాడుతుందని, ప్రభుత్వమే నడిపిస్తుందని చెప్పారు. 100 రోజుల్లో ప్రభుత్వం సాధించిన ఫలితాలు ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

శ్రీవారి లడ్డూ విషయంలో తప్పించుకునేందుకు ప్రయత్నం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌రెడ్డి ప్రజలకు, తిరుమల భక్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

దేవర సినిమాకు షోలు, ధర పెంపునకు గ్రీన్‌సిగ్నల్

నెల్లూరు(సాంస్కృతికం): జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా షోలు (అదనపు ప్రదర్శనలు), టికెట్ ధర పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. థియేటర్లలో ఉన్న టికెట్ ధర కంటే అదనంగా పెంచుకునే టికెట్ ధరలు ఇలా ఉన్నాయి. అప్పర్ క్లాస్‌కి రూ.110, లోయర్ క్లాస్‌కి రూ.60, మల్టీప్లెక్స్ థియేటర్‌లో రూ.135 వంతున 14 రోజుల వరకు టికెట్ ధర పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. అలాగే సినిమా రిలీజ్ రోజు అర్ధరాత్రి 12గంటల షోతో కలిపి 6 షోలు, మరో 9 రోజులపాటు 5 ప్రదర్శనలకు అనుమతి ఇచ్చింది.

'పరువు' హత్య కేసులో నిందితుల అరెస్టు

కొడవలూరు : మండలంలోని సత్రం గ్రామంలో తిరుమూరు శ్రావణి(24)ని కడతేర్చిన ఆమె తల్లిదండ్రులు తిరుమూరు వెంకట రమణయ్య, దేవసేనమ్మ, సహాయపడిన చెంచయ్యలను అరెస్టు చేసినట్లు సీఐ సురేంద్రబాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. సత్రం గ్రామానికి చెందిన తిరుమూరు శ్రావణికి ఐదేళ్ల క్రితం సిద్దీపురంలో వివాహం జరిగింది. పెళ్లి అయిన ఏడాదికే కుటుంబ కలహాలతో విడాకులు తీసుకొని ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటున్నది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఆములూరుకి చెందిన రబ్బానీతో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో శ్రావణి రబ్బానీని పెళ్లి చేసుకుని ఆములూరులో ఉంటున్నది. దాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు శ్రావణిని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు. మరో వ్యక్తితో రెండో పెళ్లి చేసుకోవాలని ఆమెను బలవంతం చేశారని, ఆమె మాట వినకపోగా తాను ప్రేమించిన వ్యక్తితోనే ఉంటానని చెప్పింది. దీంతో తల్లిదండ్రులు, ఆమె అక్క భువనేశ్వరి గొంతులో పురుగు మందు పోసి చంపే ప్రయత్నం చేశారని, ఆమె తప్పించుకునే ప్రయత్నం చేయగా, గొంతుకు గుడ్డ బిగించి హత్య చేశారని సీఐ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఇంటి వెనుక ఉన్న గడ్డి వామి దగ్గర పూడ్చారని ఆయన తెలిపారు. హత్య చేసిన తల్లిదండ్రులు, సహకరించిన చెంచయ్యను ఇంటి వద్దే శనివారం అరెస్టు చేశామన్నారు. అలాగే హత్యకు సహకరించిన తిరుమూరు మురళిరెడ్డిని, మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఆయన తెలిపారు. అరెస్టు చేసిన ముగ్గురిని కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ



బాధితులకు దుప్పట్లు అందజేస్తున్న పీవీ రమణయ్య

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 21: ఆంధ్రప్రదేశ్ వలంటీర్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో వరద బాధితులకు శనివారం దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. పాత రాజరాజేశ్వరిపేటలో వలంటీర్ హెల్త్ అసోసియేషన్ శాశ్వత సభ్యుడు, ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్య సభ్యులతో కలిసి 250 కుటుంబాలకు దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మోహన్‌రావు, ఇస్మాయిల్, రుద్ర, శారద, విజయలక్ష్మి, మన్మోహన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణెమా.. మాకొద్దు!

● తిరస్కరిస్తున్న వ్యాపారులు ● ఆర్‌బీఐ సూచనలు బేఖాతరు



వలేటివారిపాలెం, సెప్టెంబరు 21: మండలంలో వ్యాపారులు, పెట్రోలుబంకుల నిర్వాహకులు, చివరికి ఆర్టీసీ బస్సుల్లో సైతం రూ.10 నాణేలు తీసుకోవడంలేదు. అదేమిటంటే మీరు ఇచ్చిన ఈ నాణేలు మళ్లీ మా వద్ద నుండి జనం తీసుకోవడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఓ ప్రక్క ఈ నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా తీసుకోనేం దుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఆర్‌బీఐ రూ.10ల నోట్ల స్థానంలో వీటిని అందుబాటు లోకి తీసుకొచ్చింది. కొంతకాలం ఈ నాణేలపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా రెండేళ్లుగా దుకాణదారులు వాటిని తీసుకోనేందుకు విముఖత చూపుతున్నారు. రూపాయి, రెండు, ఐదు రూపాయల నాణేల తరువాత పది రూపాయల నాణెం విలువైనది. ఇప్పటికే ఐదేళ్లు దేశవ్యాప్తగా చెలామణిలో ఉన్నా మన ప్రాంతంలో అందుబాటులో లేదు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడు, చెన్నై, మహనగరాల్లో ఈ నాణెం చెల్లుబాటులో ఉంది. ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సుల్లో, వ్యాపార సముదాయాల్లో విరివిగా వినియోగిస్తున్నా రు. అక్కడ వినియోగంలో ఉన్న నాణేన్ని మండలంలో ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కావడం లేదని కొందరు చర్చించుకుంటున్నారు.

తీసుకోకపోతే కేసు

ఈ నాణెం చెల్లుబాటు అవుతుందని ఇటీవల రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంలకు, ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణ్యిజ సముదాయాల్లో నాణేన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు. పది రూపాయల నాణెం చెలామణిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

నీరెళ్లే దారేది..



అధికారుల అనాలోచిత నిర్ణయంతో ఏర్పాటు చేసిన సిమెంట్‌రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుండడంతో పాదచారులు, వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. పట్టణంలోని బాలాజీనగర్‌లో గత కొన్నేళ్ల క్రితం దిగువలో వర్షపు నీరు వెళ్లలేని విధంగా సిమెంట్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. చిన్నపాటి వర్షానికే ఆ రహదారిపై నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసనతోపాటు దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారుతోంది. ఆ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

\- ఉదయగిరి రూరల్

కేబుల్ వైర్లు ఇలా.. స్తంభం ఎక్కేదెలా?



స్థానిక సౌత్ జనతాపేటలో ఆర్వోబీ వంతెన సమీపంలోని విద్యుత్ స్తంభం కనిపించకుండా దాని చుట్టూ కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారు. ఇళ్ల సర్వీస్ వైర్లు మరమ్మతులు చేయాలన్నా, వీధిలైట్లు రిపేరు చేయాలన్నా స్తంభం ఎక్కేందుకు కూడా అవకాశాలు లేకుండా కేబుల్ వైర్లు ఉన్నాయి. ఈ విషయంపై సబంధింత అధికారులు స్పందించి కేబుల్ వైర్లు తీసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

\- కావలి

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



స్థానిక బస్టాండు సెంటరులోని మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో జనాలు కూర్చోనేందుకు సిమెంటు బల్ల ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎప్పుడు ఎవరికి ఏం ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

\- వలేటివారిపాలెం

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



విద్యుత్ సిబ్బందితో సమీక్షిస్తున్న డీఈ రమేష్ చౌదరి

సంగం, సెప్టెంబరు 21: వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డీఈ రమేష్ చౌదరి సిబ్బందికి సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని, సోలార్ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అధిక లోడు ఉన్న ఏరియాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏడీ శ్రీనివాసులు, ఏఈ శ్రీనివాసులురెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డీఎస్పీ



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐలు

కావలి, సెప్టెంబరు 21: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణలో భాగంగా శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విద్యాసంస్థల బస్సులు, పట్టణ ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎంతోమంది ప్రాణాలు డ్రైవర్ల చేతులలో ఉన్నాయని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ వాహనాల డాక్యుమెంట్లు ఉండాలన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మైనర్లుకు వాహనాలు ఇవ్వరాదని, బైక్‌లకు సైలెన్సర్లు విప్పి పెద్ద శబ్ధాలతో డ్రైవింగ్ చేసున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు డయల్ చేయండి

కలిగిరి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు సమాజంలో జరిగే అన్యాయాలు, అకృత్యాలపై శనివారం ఎస్ఐ ఉమాశంకర్ అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించినా లేదా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా వెంటనే 100డయల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కలిగిఉండటంతో పాటు, హెల్మెట్ ధరించాలని వాహన దారులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని, ఆన్‌లైన్ గేమింగ్స్, సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు 108కు సమాచారం అందించాలన్నారు.

న్యాయం చేయాలంటూ ఆందోళన

వరికుంటపాడు, సెప్టెంబరు 21: అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న భూమిని తిరిగి గ్రామానికే అప్పగించాలంటూ శనివారం విరువూరు గ్రామస్థులు ముడియాల మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సర్వే నంబరు 518లోని మేత పోరంబోకు భూమిలో నిబంధనలకు విరుద్ధంగా మొక్కలు నాటడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. తాము కోర్టును ఆశ్రయించినప్పటికీ తీర్పును ధిక్కరించిన అధికా రులు జాయింట్ సర్వే చేయకుండానే పనులు చేపట్టా రన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయా లని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

సంగం, సెప్టెంబరు 21: మండలంలోని దువ్వూరులోని ఆస్తాన ఏ నూరియా దర్గాలో గంధ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పీఠాధిపతి హజరత్ ఆల్ హాజ్ షేక్ షాబాషా నూరి సాహెబ్ గంధాన్ని మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేరుకుంది. అనంతరం మత పెద్దల ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్, సెప్టెంబరు 21: స్థానిక మద్దూరుపాడు సమీపంలోని ఏఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోని పేకాట స్థావరంపై శనివారం రాత్రి రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ రాజేశ్వరరావుకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ బాజిబాబు దాడులు నిర్వహించి 6గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.9,130 స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తల్లి చెంతకు బాలిక

కావలి రూరల్, సెప్టెంబరు 21: స్థానిక జెండాచెట్టు సెంటర్‌లో తల్లి నుండి తప్పిపోయి ఏడుస్తూ తిరుగుతున్న 8ఏళ్ల షేక్ హబీబాను శనివారం రాత్రి 1వ పట్టణ సీఐ ఫిరోజ్ తల్లి వద్దకు చేర్చారు. వైకుంఠపురం ఫాతిమ తన కుమార్తె హబీబాతో షాపింగ్‌కు వెళ్లారు. అక్కడ తల్లి నుండి తప్పిపోయి ఏడుస్తూ హబీబా తిరుగుతుండటాన్ని గుర్తించిన స్థానికులు సీఐకు సమాచారం అందజేశారు. ఏఎస్ఐ శైలజను అక్కడకు పంపడంతో బాలిక నుండి వివరాలు తెలుసుకుని తల్లి చెంతకు చేర్చారు.

ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

కలిగిరి, సెప్టెంబరు 21: విధుల్లోంచి తొలగించిన రావులకొల్లు ఆశవర్కర్ పందిటి విజయమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ శనివారం మండల ఆశా వర్కర్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచు రాజకీయ కక్షతో చిరుద్యోగిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆమెకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉమా శంకర్ అక్కడికి చేరుకున్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా నిరసన చేపట్టాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఆశవర్కర్స్ యూనియన్ ప్రధనా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణ, మండల అధ్యక్షురాలు పల్లాపు అరుణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం



మారంరెడ్డిపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కలువాయి: : మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

సీతారామపురం, సెప్టెంబరు 21: సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించి రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండల పరిధిలోని మారంరెడ్డిపల్లి అరుంధతివాడలో సర్పంచ్ గాజులపల్లి భారతి చంద్రరెడ్డి, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే మారంరెడ్డిపల్లి ఆర్‌సియం స్కూల్‌కి వెళ్లి మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పబ్బులేటిపల్లిలో నూతన బోరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, పిడుగు రమేష్, కాశీరత్తయ్య (గాంధి), గౌస్, మండల అధికారులు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూనూ అపవిత్రం చేశారు : ఎమ్మెల్యే కురుగొండ్ల

కలువాయి: కోట్లాది మంది భక్తులకు పరమపవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూనూ జగన్ అపవిత్రం చేశారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం కలువాయి మండలం బ్రాహ్మణపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించి కరపత్రాలు అందచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీక రించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీ డీవో గోవర్ధన్, తహసీల్దారు సంజీవకుమారి, బీజేపీ వెంకటగిరి ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నాయకులు గంగోటి నాగేశ్వరావు, జీ వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఇంటూరి

గుడ్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలన అందిస్తుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మొగుళ్లూరు కేజీబీవి పాఠశాల వసతి, భద్రతలను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు స్వర్ణ, ఉపాధి ఏపీడీ బాబూరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ సురేష్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, నాయకులు జనిగర్ల నాగరాజు, సర్పంచ్ పాలకీర్తి శంకర్, ఎంపీటీసీలు చెన్నారెడ్డి వరమ్మ, గోచిపాతల శ్రవంతి, పువ్వాడి వేణు, రావూరి వేణు పాల్గొన్నారు.



గుడ్లూరు: మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

●దగదర్తి (బిట్రగుంట): చెన్నూరులో శనివారం ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. దగదర్తి చెరువులో ఆక్రమణలు తొలగిస్తామని, మండలంలో త్వరలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల కన్వీనర్ అల్లం హనుమతరావు, సోమశిల మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, పార్టీనేతలు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, జలదంకి శ్రీహరినాయుడు, సర్పంచు నాయక్, మల్లికార్జునరెడ్డి, జనసేన వెంకట యాదవ్ ఉన్నారు.

●సంగం: జండాదిబ్బలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ, తహసీల్దారు సోమ్లానాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు జి శ్రీనివాసులు యాదవ్, నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు తిరుమల నాయుడు, నరేష్, పాల్గొన్నారు.

●దుత్తలూరు(ఉదయగిరి రూరల్): ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భా గంగా శనివారం టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం సచివాలయ సిబ్బందితో కలిసి మండలంలోని కొత్తపేట, వెంగన్నపాళెం, లక్ష్మీపురం, దుత్తలూరు తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, చుండి హరిగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా పాల్గొన్నారు.

●ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే దాసరిపల్లి పంచాయతీలో మాజీ సర్పంచ్ సయ్యద్ జమ్మత్‌బేగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఈర్ల శంకర్, షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : మండలంలోని కనియంపాడులో శనివారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దగదర్తి (బిట్రగుంట): ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

మన ఇల్లు - మన గౌరవంపై అవగాహన

ఆత్మకూరు, సెప్టెంబరు 21: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో హౌసింగ్ ఏఈ గృహ నిర్మాణశాఖ పర్యవేక్షణకు నియమించబడ్డ సచివాలయ ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు మన ఇల్లు - మన గౌరవంపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రధానమంత్రి అవాస్ యోజన, ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో నిర్మిస్తున్న పక్కా గృహాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు ఈనెల 28న లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అందచేస్తున్న రూ. 1.8 లక్షలను గృహాలు నిర్మించుకుంటున్నవారికి స్టేజీల వారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా బేస్మెంట్ పూర్తి చేసుకున్న వారికి 50 రోజుల పని దినాలు, రూఫ్ లెవల్ వరకు చేసుకున్న వారికి 40 రోజుల పనిదినాలు వేతన రూపంలో చెల్లించడం జరుగుతుందని, పొదుపు సంఘాలలో ఉన్నవారికి అర్హతను బట్టి ఎస్‌హెచ్‌జీ రుణాలు ఇప్పిస్తామని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసుకునే విధంగా లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



భూ రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 21: మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు నాగరాజు హెచ్చరించారు. బ్రహ్మేశ్వరంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారని గ్రామస్థులతో కలిసి సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు ఫిర్యాదు చేయడంతో శనివారం రెవెన్యూ సిబ్బందితో ఆయా భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓ రైతు కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేశాడన్నారు. ఆభూమిలో ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మల్లేశ్వరరావు, సర్వేయర్ మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగంలో ఇసుక విక్రయాల ప్రారంభం



టిప్పర్‌కు లోడు చేస్తున్న ఇసుక

సంగం, సెప్టెంబరు 21: సంగం వద్ద ఏర్పాటుచేసిన ఇసుక డంపింగ్ యార్డ్‌లో శనివారం విక్రయాలు ప్రారంభమయ్యాయి. సంగం పెన్నా నదిలో డ్రెడ్జింగ్ విధానంలో పడవల ద్వారా గత 20 రోజుల నుండి డీసిల్టేషన్ తీసిన ఇసుకను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. నిల్వచేసిన ఇసుకను ప్రభుత్వ ఆదేశాల మేరకు మెట్రిక్ టన్ను ఇసుక రూ. 350 చొప్పున టిప్పర్‌కు ఇసుక లోడ్ చేశారు. సచివాలయంలో ఆన్‌లైన్‌లో ఏపీ శాండ్ పోర్టల్‌లో చలానా తీసుకువచ్చిన వాహనదారులకు ఇసుక విక్రయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులతోపాటు మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్



ప్రైవేట్ బస్సులను అడ్డుకుంటున్న ఆర్టీసీ అధికారులు

కావలి, సెప్టెంబరు 21: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ప్రయివేట్ బస్సులు ప్రయాణికులను ఎక్కించుకోకుండా శనివారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు రావూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయివేట్ బస్సులు డిపో వద్ద ఆపి ప్రయాణికులను ఎక్కించుకునే వెళుతుండటంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతుందని దీన్ని అరికట్టేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, బస్టాండ్ మేనేజరు రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, ఉద్యోగ సంఘాల నాయకులు రఘునాథరెడ్డి, వెంకటేశ్వర్లు, చెంచురామయ్య, రమణయ్య, నారపరెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు రూ. 2లక్షల చెక్కు అందజేత

సీతారామపురం : విజయవాడ వరద బాధితుల కోసం సీతారామపురం గ్రామానికి చెందిన ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాసేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు రూ.2 లక్షల చెక్కును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విజయవాడలో అందజేశారు. నియోజకవర్గ సమస్యలు, పార్టీ బలోపేతం గురించి పవన్‌తో చర్చించినట్లు కాశీరావు తెలిపారు.

కావలి : ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారులకు శనివారం కావలి ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి మునునూరు పార్టీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. నలుగురికి రూ.1,30,285 వచ్చాయన్నారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబు, వాటికోసం కృషిచేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



డిప్యూటీ సీఎంను కలిసిన భోగినేని

మాలకొండ ఆదాయం రూ.8.57లక్షలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 21: మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి భక్తుల నుండి రూ.8,56,839 ఆదాయం వచ్చినట్లు శనివారం ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌తో రూ.5,850, కుంకుమార్చనతో రూ.18,480, తలనీలాలు ద్వారా రూ.31,700, వాహనపూజతో రూ.3,120, ప్రత్యేకదర్శనంతో రూ.1,71,800, కవర్లు ద్వారా రూ.6వేలు, రూము అద్దెలతో రూ.32,700, స్థల పురాణం, పుస్తకాలు విక్రయాలతో రూ.380, లడ్డుప్రసాదం ద్వారా రూ.2,06500, అన్నదానంతో రూ.3,19,793, విరాళముల ద్వారా రూ.60,516 వచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొండాపురం, సెప్టెంబరు 21: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ రవికుమార్ తెలిపారు. స్థానిక ఆదర్శపాఠశాలలో శనివారం జరిగిన మండలస్థాయి ఆటలపోటీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్ బ్యాట్మింటన్ పోటీలో వివిధ పాఠశాలల నుంచి 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవో-2 ఆనందరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌భాషా, మండల కో ఆర్డినేటర్ రాఘవరావు పాల్గొన్నారు.

కావలి టౌన్: విశ్వోదయా బాలల దినోత్సవ క్రీడాపోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమై అథ్లెటిక్స్ పోటీలు జరగ్గా, శనివారం గేమ్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలో ప్రతిభ చూపి విద్యార్థులను విశ్వోదయా సెక్రటరీ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి విజేతలను అభినందించారు. నవంబరు 15న జేబీ ఎంఎ హాల్‌లో జరగనున్న బాలల దినోత్సవంలో విజేత లకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి పోటీలను పర్యవేక్షించగా పీడీలు పీఈటీలు సహకారం అందించారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, సెల్ఫ్ పైనాన్స్ కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

● బిట్రగుంట : కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో అథ్లెటిక్ పోటీలు ప్రారంభం అయ్యాయి. విజేతలకు కళాశాల స్పోర్ట్స్ డే రోజున జ్ఞాపికతో పాటు బహుమతులను అందజేయనున్నట్లు ఏవో ఆర్‌వీ రమణారెడ్డి తెలిపారు.

రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

వింజమూరు : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఆర్‌అండ్‌బీ ఎస్సీ ఎం గంగాధర్‌తో రోడ్ల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ గంగాధర్ మాట్లాడుతూ కలిగిరి, కొండాపురం, వింజమూరు రోడ్లను పరిశీలించామని వాటిలో కొన్నింటిని మంజూరు చేసినట్లు ఎమ్మెల్యేకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈజీ రామకృష్ణ, డి.ఈ చక్రధర్‌రావు, నేషనల్ హైవే డీఈ అనీల్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



వైభవంగా వెండి నందిసేవ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 21 : జొన్నవాడ ఆలయంలో శనివారం రాత్రి కామాక్షితాయి అమ్మవారికి పెద్ద వెండి నందిసేవ జరిగింది. నంది వాహనంపై స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. అనకాపల్లికి చెందిన కొనగళ్ల వెంకట రమణమూర్తి పరమేష్, వెంకట నూకరత్నం (రోజా)లు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చంద్రబాబు నేతృత్వంలో ప్రజారంజక పాలన

రాపూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందని రాపూరు టీడీపీ అధ్యక్షుడు ఏదోటి కోటి నాయుడు అన్నారు. రాపూరులో శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, రాపూరు మాజీ సర్పంచ్ పచ్చిగాళ్ల రత్నయ్య, డాక్టర్ వేణుగోపాల్, సంకల పాపయ్య, మహేష్, టీడీపీ మహిళా నాయ కురాలు రావణమ్మ, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై సదస్సు

బుచ్చిరెడ్డిపాళెం : నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని సీఐ వీ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం మినగల్లులో సర్పంచు బొర్రు పూజిత, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, బొర్రు రాము, నరసింహులు, సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నేతలు

విడవలూరు: ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కిషోర్ కుమార్ యాదవ్‌ను శనివారం పార్లపల్లి గ్రామ టీడీపీ నేతలు వేగూరు చంద్రారెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డిలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా, రాత్రిళ్ల చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు(వైద్యం) : నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నంతోపాటు పలువురు సిబ్బంది నగరంలోని సరస్వతి స్కాన్ సెంటర్, సాయి పదం ఆసుపత్రి, సింహపురి స్కాన్ సెంటర్, విజయ ఆసుపత్రి, క్రిస్టల్ స్కాన్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఫారం ఎఫ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రతి నెల 2వ తేదీన ఆ వివరాలు వైద్య ఆరోగ్యశాఖలోని డెమో విభాగంలో సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ విజయకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ ఎంపికలు

వెంకటాచలం : సర్వేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు శనివారం ముగిశాయి. అండర్-17 బాలుర విభాగంలో కబడ్డీ పోటీల్లో చెముడుగుంట, కనుపూరు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మండల కో ఆర్డినేటర్ అర్జున్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమంలో వైద్య శిబిరం

నెల్లూరు(వైద్యం : ఆస్థాన శిష్టియ మహిళా మండలి ఆశ్రమంలోని వృద్ధుల ఆశ్రమంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. వైష్ణవి న్యూరో స్పెషాలిటీ ఆసుపత్రి, కమ్యూనిటీ పారామెడిక్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. డాక్టర్ వైష్ణవి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, షేక్ రసూల్, మహ బూబ్‌బాషా, గోరంట్ల శేషయ్య, పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

నెల్లూరు (వ్యవసాయం) : చేనేత సహకార రంగాన్ని ప్రారంభించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు బూదాటి రాధయ్య, జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ కొనియాడారు. లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓఆసుపత్రిలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



కంకర లేచిన రోడ్డును చూపుతున్న ఆటోడ్రైవర్లు

ఇదేం రోడ్డు సార్..!

మనుబోలు : మండలంలోని గురివింద పూడి రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నా మంటూ ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై శనివారం వారు ఆందోళన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు గ్రామానికి కొత్త రోడ్డు వేసేందుకు పాతరోడ్డు తవ్వారు. దానిపై కంకర, యాష్‌పౌడర్ పోశారు. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పనిని ఆపేశారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పూర్తిచేయాలని వారు కోరారు.

ఉర్రూతలూగించిన యాదే రఫీ మ్యూజికల్ నైట్

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 21 : బహుబాషా సినీ నేపథ్య మధుర గాయకుడు మహమ్మద్ రఫీ 44వ వర్ధంతి వేడుకలు శనివారం రాత్రి పురమందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన 31వ యాదే రఫీ మ్యూజికల్ నైట్ శ్రోతలను ఉర్రూతలూగించింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల ఆశీస్సులతో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరు ఆర్డీవో మాలోలా పాల్గొని మహ్మద్ రఫీ పాడిన మధుర గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సభ్యులు అస్లాం, జావీద్, మహబూబ్‌బాషా, సుజాత, శాంతి, జావిద్ అహ్మద్ పాల్గొన్నారు. నగర ప్రముఖులు మహమ్మద్ రఫీకి నివాళులర్పించారు. గాయనీ గాయకులను అభినందించారు.

అన్న క్యాంటీన్లతో పేదవాడి ఆకలి తీరింది!

- 'ఇది మంచి ప్రభుత్వం'లో రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, సెప్టెంబరు 21 :రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చి పేదవాడి ఆకలితీర్చడం జరిగిందని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 33వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లిన ఆయన కరపత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన సౌకర్యాలను వివరించారు. అలాగే 29వ డివిజన్ వీఎంఆర్ నగర్‌లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమాలలో 33వ డివిజన్ కార్పొరేటర్ కరణం మంజుల, నాయకులు జలదంకి సుధాకర్, హరత్‌నాయుడు, రాజానాయుడు, గంగాధర్‌లు పాల్గొన్నారు.

టీడీపీలో కార్పొరేటర్ల చేరిక

నెల్లూరురూరల్లో వైసీపీని వీడిన ముగ్గురు కార్పొరేటర్లు అవినాష్, విజయలక్ష్మి, యాకసిరి వాసంతిలు తమ అనుచరగనంతో రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని అక్కడ శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. వీరితో పాటు స్థానిక డివిజన్లలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.

44వ డివిజన్‌లో...

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని 44వ డివిజన్ 80వ బూత్ పరిధిలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు ఇంటింటికి కూటమి ప్రభుత్వం 100 రోజులలో చేసిన అభివృదికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రత్నారెడ్డి, ఝాన్సీ, వై.రమేష్, నాగేశ్వరరావు, అరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించేలా చంద్రబాబు కృషి

- రామతీర్థంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విడవలూరు, సెప్టెంబరు 21: ఆర్థిక సంక్షోభం లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నాడని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రామతీర్థంలో శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలు త రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతు లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన కాలనీలో పర్యటించి, 100రోజుల పాలనలో చేసిన అభివృద్ధిపై కరపత్రాలు, గోడపత్రికలను అందజే శారు. అనంతరం వీపీఆర్ మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా శ్రమిస్తున్న చంద్రబాబు సీఎం కావడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ప్రజలకు చేతనైనంత సేవ చేసేందుకు తాను, తన శ్రీమతి ప్రశాంతిరెడ్డి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ దీపావళికి ఉచితంగా 3 సిలిండరు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, చెముకుల శ్రీనివాసులు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

వారాహి మహాయోగంలో పాల్గొనాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు జరుగుతున్న వారాహి మహా రథయాత్రలో భాగంగా ఈ నెల 23వ తేది మధ్యాహ్నం వీఆర్సీ మైదానంలో జరిగే వారాహి మహా యాగంలో పాల్గొని వారాహి అమ్మ వారి కృపాకటాక్షములు పొందాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పిలుపునిచ్చారు. వారాహి మహాయాగంకు సంబంధించిన కమిటీ సభ్యులు శనివారం నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గునుకుల కిషోర్‌కు ఆహ్వానపత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హర్ష, మణికుమార్ రెడ్డి, అంకుశం నాగిశెట్టి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల సాయం

కోవూరు, సెప్టెంబరు21: విజయవాడ వరద బాధితులకు మండలంలోని మండల పరిషత్ పాఠశాలల చిన్నారులు చేయూతను అందించారు. తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని పోగుచేసి వారు రూ.10వేలు కూడబెట్టారు. ఆ మొత్తాన్ని సీఎం సహాయనిధికి రిజిష్టరు పోస్టు ద్వారా పంపారు. వీరిని హెచ్ఎం బత్తల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ హిందూ, శాంతినగర్, ఆర్సీపురం, కొత్తూరురోడ్డు, గాంధీసంగం, వీజీసీ, ఎంపీయూపీఎస్ గంగవరం, గుంటకట్టల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడితో పాకెట్ మనీ పోగుచేసిన చిన్నారులు

వర్సిటీ సిబ్బంది..

- వెంకటాచలం : విజయవాడ వరద బాధితులకు శనివారం విక్రమ సింహపురి యూనివర్సిటీ తనవంతు సాయాన్ని అందించింది. వీసీ డాక్టర్ ఎస్. విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది సహకారంతో బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఇతర వస్తువులు సేకరించారు. వీటిని 270 కుటుంబాలకు పంపిణీ చేసేందుకు ప్రత్యేక వాహనంలో విజయవాడకు తరలించారు. ఆ వాహనానికి వీసీ శనివారం జెండా ఊపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, టీ వీరారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయశంకర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్, డాక్టర్ బీవీ.సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోడూరు బీచ్‌లో స్వచ్ఛ సాగర్



టీపీ గూడూరు : కోడూరు బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను క్లీన్ చేసిన స్వచ్ఛంధ సంస్థలు, విద్యార్థులు



ముత్తుకూరు : స్వచ్ఛత హి సేవలో పాల్గొన్న ఎడిబుల్ ఆయిల్ పరిశ్రమల ప్రతినిధులు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 21: మండలంలోని కోడూరు బీచ్ వద్ద శనివారం స్వచ్ఛతా హి సేవలో భాగంగా స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర మిత్ర మత్స్యకార ప్రతినిధులు, ఫిషరీస్ సంస్థ, బాలరక్షాభారత్, చెన్నపల్లిపాళెం హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి తీరం వెంబడి పేరుకున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి, ట్రాక్టర్ ద్వారా బయటకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట ఎఫ్‌డీవో సంజయ్ స్టీఫెన్, సాగర్ మిత్ర ఇన్‌చార్జి నిర్వాహకులు ముత్యాల సుధాకర్, జిల్లా అధ్యక్షుడు రమేష్, మానవ చైతన్య సమితి ప్రతినిధులు, బాల రక్షాభారత్ ప్రతినిధి షేక్.మస్తాన్, మెరైన్ సిబ్బంది హెచ్ఎం ఆర్.సాయిప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ ఏ రాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎడిబుల్ ఆయిల్ పరిశ్రమల ప్రతినిధులు తెలిపారు. పంటపాలెంలో శనివారం స్వచ్ఛత హి సేవలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, సర్పంచి అలపాక శ్రీనివాసులు, ఎడిబుల్ ఆయిల్ పరిశ్రమల జీఎంలు, హెచ్‌ఆర్‌లు, పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా అక్టోబరు 2 వరకు స్వచ్ఛత హి సేవ కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్టు నెహ్రూ యువజన కేంద్రం జిల్లా అధ్యక్షుడు ఆకుల మహేంద్ర అన్నారు. బుచ్చి డీఎల్ఎన్ఆర్ హైస్కూలులో శని వారం నెహ్రూ యువజన కేంద్రం, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్ర టతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఎన్‌సీసీ అధికారి కే.దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా నగర పంచాయతీలో శనివారం కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం, అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలు దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారితో చలానాలు కట్టించారు.



బుచ్చిలో ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థినులు

నేడు టీడీపీలోకి బుచ్చి చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతోపాటు పలువురు కౌన్సిలర్లు ఆదివారం టీడీపీలో చేరనున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ల సమక్షంలో వారు తెలుగుదేశంలో చేరనున్నారు.

శభాష్.. పవన్: సోమిరెడ్డి అభినందన



పవన్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న సోమిరెడ్డి

మనుబోలు, సెప్టెంబరు 21: మండలంలోని పిడూరుకి చెందిన పవన్‌కల్యాణ్‌రెడ్డిని శనివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినందించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు నారా లోకేష్ పంపిన ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా వడ్లపూడిలో పవన్ అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో పిడూరు టీడీపీ నాయకులు తిక్కవరపు శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, మానుగుంట సుధాకర్ రెడ్డి, మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, శివుడు రాజాగౌడ్ పాల్గొన్నారు.

- దేగపూడి-బండేపల్లి కాలువకు కట్టుబడి ఉన్నా

దేగపూడి-బండేపల్లి కాలువపై తాను ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్లపూడిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ్లపూడి టీడీపీకి కంచుకోట కావడంతో సచివాలయాన్ని అక్కంపేటలో పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఏర్పాటుచేసిన గర్భిణుల సీమంతంలో పాల్గొని మహిళలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సర్పంచు రమాదేవి,టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, బొమ్మిసురేంద్ర, జనసేన నియోజకవర్గ నాయకులు బీ సురేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవరపాళెంలో నారా లోకేష్ ఆరోగ్య రక్ష

- అట్టహాసంగా ఏర్పాట్లు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 21 : పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో కోటంరెడ్డి సోదరులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహించబోతున్న నారా లోకేష్ ఆరోగ్యరక్ష కార్యక్రమం ఆదివారం ప్రారంభం కానున్నది. మండలంలోని దేవరపాళెంలో ఈ కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను శనివారం టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ఏర్పాట్లు చేపట్టినట్లు వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని తమ గ్రామంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పేదలు, నిరుపేదలకు ఆధునిక వైద్యం అందించాలన్న ఆలోచన కోటంరెడ్డి సోదరులకు రావడం అభినందనీయమని తెలిపారు.



సభ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

'ఉపాధి'లో అవినీతిపై విచారణ

మనుబోలు, సెప్టెంబరు 21: మండలం లోని వీరంపల్లి సచివాల యంలో శనివారం ఉపాధి హామీ అధికారులు విచారణ చేపట్టారు. తమ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో 2021నుంచి సుమారుగా రూ. కోటి అవినీతి జరిగిందంటూ గ్రామస్థులు ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డ్వామా పీడీ ఆదేశాలతో విచారణకు అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి, ఈసీ శ్రీనువాసులు వచ్చారు. గ్రామస్థులు ఫిర్యాదు చేసిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మన్ మాట్లాడుతూ ఫిర్యాదులో ఇచ్చిన వివరాల మేరకు క్షేత్రపరిశీలన, ఉపాధి కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజమ్మ, ఈసి సుప్రజ, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



వీరంపల్లి సచివాలయంలో విచారణ చేస్తున్న ఉపాధి అధికారులు

గురజాడ దృక్పథం అభ్యుదయవాదం

నెల్లూరు (సాంస్కృతికం) : మహాకవి గురజాడ దృక్పధం అభ్యుదయ వాదమని, ఆయన తెలుగు వ్యవహారిక భాష ఆవశ్యకతను ఆనాడే గుర్తించి ఎంతో కృషి చేశారని శ్వేత మాజీ సంచాలకుడు భూమన్ తెలిపారు. శనివారం రాత్రి నెల్లూరు వర్ధమాన సమాజం భవనంలో గురజాడ 162వ జయంతి సభ జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ లతీఫ్ కుట్టీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆత్మీయ అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, చిరసాని కోటిరెడ్డి, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సీవీ సుబ్రహ్మణ్యం, మెట్టు రామచంద్రప్రసాద్, నలబోలు బలరామయ్యానాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లో గురజాడ జయంతి సభ జరిగింది. ప్రజాసైన్సు అధ్యక్షుడు సతీష్‌కుమార్, సాహిత్య సేవ, రచనలు గురించి విద్యార్థులకు వివరించారు.



వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని వినతి

నెల్లూరు(హరనాథపురం) : వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మ ద్ జియాఉల్‌హక్ ఆధ్వర్యం లో నాయకులు శనివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా అబ్దుల్ అజీజ్, ముస్లిం ఫెడరేష్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ షాహుల్, మైనార్టీ నాయకులు మసూద్, హాజీ మొహ్మద్ మగ్దూం, షేక్ సుబహానీ, షేక్ షఫీ ఉల్లా, షేక్ రోషన్ పాల్గొన్నారు.

- క్రీడాకారులు జాతీయ చెస్ పోటీల్లో రాణించాలి

నెల్లూరు(విద్య): ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైపాడుగేటు సెంటర్ కేవీఆర్ గ్రాండ్‌లో ఆదివారం జరిగే అఖిలభారత చెస్ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమంగా రాణించాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. నగరంలోని ఆమె నివాసంలో శనివారం క్రీడాపోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో 200 మంది అంతర్జాతీయ క్రీడాకారులతో పాటు 500 మంది జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ చెస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సుమన్, నిర్వాహకులు ఎస్.వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, నర్రా విజయ్‌కుమార్, గోపీనాథ్ పాల్గొన్నారు.

విపత్తులో కార్మికుల సేవలు ప్రశంసనీయం : కమిషనర్

నెల్లూరు(సిటీ) : విజయవాడ జల విపత్తులో కార్పొరేషన్ కార్మికుల సేవలు ప్రశంసనీయమని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ అన్నారు. శనివారం ఎన్ఎంసీలో విపత్తులో పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు కొత్త దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ విపత్తులో 325 మంది కార్మికులు విధుల్లో పాల్గొన్నారని తెలిపారు. వారి సేవలకు గౌరవంగా దుస్తులు పెడుతున్నట్లు చెప్పారు. అనంతరం కమాండ్ కంట్రోల్ భవనంలో హెల్ప్ లైను ద్వారా వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ శర్మద, డీసీ చెన్నుడు, తదితరులు పాల్గొన్నారు.

దినసరి కూలీల సమస్యల్ని పరిష్కరించాలి

కోవూరు, సెప్టెంబరు 21 : రాష్ట్రంలోని టూరిజం శాఖలో దినసరి కూలీలు, కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్నవారి సమస్యలు పరిష్కరించాలని టూరిజం ఎంప్లాయీస్ జేఏసీ అసోసియేట్ ప్రెసిడెంట్ తురకా శ్రీనివాసులు కోరారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రమం త్రి కే దుర్గేష్‌ను విజయవాడలో శనివారం ఉద్యోగులు కలిసి వినతిపత్రం సమర్పించారు. టూరిజం యూనిట్లను ప్రైవేటీకరణ చేయవద్దని విన్నవించారు.దినసరి కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ యిచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ నాయకులు వీరారెడ్డి, పవన్‌కుమార్, రోశిరెడ్డి తదితరులున్నారు.

ఆటో ప్రచారజాతా ప్రారంభం

ముత్తు కూరు, సెప్టెం బరు 21 : అదానీ కృష్ణప ట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ సాధన కోసం నిర్వహిస్తున్న బహి రంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ రావు పిలుపునిచ్చారు. శనివారం ముత్తుకూరులో ఆయన ఆటో ప్రచార జాతాను ప్రా రంభించారు. ముత్తుకూరులో ఆదివారం జరిగే బహిరంగ సభకు ప్రజలంతా తరలి వచ్చి కంటైనర్ టెర్మినల్ సాధనకు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, నక్కా రాధయ్య పాల్గొన్నారు.



ఆటో జాతా ప్రారంభించిన సీఐటీయూ నాయకులు

తిరుమలకు రైతుల పాదయాత్ర

కోవూరు: స్థానిక శ్రీవీరాంజ నేయస్వామి ఆలయం నుంచి శనివారం శ్రీవారిసేన సంస్థ ఆధ్వర్యంలో సుమారు 100 మంది తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. కోవూరు నియోజకవర్గ పరిధి లోని రైతులు సుఖ సంతోషాలతో కొనసాగాలని ప్రార్థి స్తూ గత 17 ఏళ్లగా రైతులు పాదయాత్ర చేస్తున్నారు. పాదయాత్ర సభ్యులను నెల్లూరు మాగుంట లేఅ వుట్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభినందించారు. పడుగుపాడులో వారికి మాజీ సర్పంచు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి స్వాగతం పలికారు. ఈ బృందానికి శ్రీవారిసేన సంస్థ ప్రతినిధులు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి నాయకత్వం వహించారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై నేతల ఆందోళనలు

జగన్,వైవీ,భూమన దిష్టిబొమ్మల దహనం

ఆగ్రహావేశాలు



శ్రీవారి భక్తులు పవిత్ర ప్రసాదంగా భావించే లడ్డూను అపవిత్రం చేశారంటూ తిరుపతిలో శనివారం ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు ఆందోళనలు చేపట్టారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినదించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ , టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బా రెడ్డి, భూమన కరుణాకర రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.వారిని అరెస్టు చేయాలని బీజేపీ నేతలు, జనసేన నేతలు ఎస్పీ సుబ్బరాయుడికి వినతిపత్రాలు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



బీజేపీ నిరసన





జనసేన నిరసన

అఖండ దీపానికీ అదే నెయ్యి వాడారా?

'కల్తీ నెయ్యిని లడ్డూ ప్రసాదాల్లో వినియోగించడమే కాకుండా శ్రీవారి మూలవిరాట్ ముందు అఖండ దీపానికి వినియోగించి ఉంటే దానిపైనా విచారణ జరగాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాలి' అని కూటమి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు , పులివర్తి నాని, మురళీ మోహన్ , గురజాల జగన్మోహన్ డిమాండు చేశారు.. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.శనివారం తిరుపతిలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. లడ్డూ నాణ్యత తగ్గిందని పవన్ కల్యాణ్ గతంలోనే చెప్పారని జంగాలపల్లి శ్రీనివాసులు అన్నారు. అన్యమతస్తులు సర్వనాశనం చేశారని, అయితే దేవుడి శిక్షనుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. స్వయం ప్రకటిత మేధావి కరుణాకర రెడ్డి ఏమీ ఎరగనట్టు ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.తిరుమలను కూడా వైసీపీ వారు సొంత అవసరాలకు వాడుకున్నారని పులివర్తి నాని ఆరోపించారు. ఈ వ్యవహారంలో జగన్‌కు అత్యంత సన్నిహితుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ప్రమేయమూ ఉందని ఆరోపించారు. ఆల్ఫా కంపెనీకి 2లక్షల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా కాంట్రాక్టు ఇచ్చారంటే కమీషన్లకు కక్కుర్తిపడే ఆ పనిచేశారని ఎవరికైనా అర్థమైపోతుందన్నారు. ఆధ్యాత్మికతనం వంటినిండా పులుముకుని కనిపించే చెవిరెడ్డి ఇప్పుడు ఎక్కడికి పోయారో తెలియడంలేదన్నారు.తిరుమలలో అపచారం జరిగిందని నిరూపిస్తే డైవర్షన్ రాజకీయాలంటారా? వైసీపీవే వక్రబుద్ధి రాజకీయాలని మురళీ మోహన్ విమర్శించారు. ఆలయాన్ని వైసీపీ కార్యాలయంలాగా మార్చుకున్నారని పేర్కొన్నారు. లడ్డూ కల్తీపై చర్చకు, ప్రమాణానికి సిద్ధమా అని నారా లోకేశ్ సవాల్ విసిరితే తప్పు చేయకపోతే కోర్టును ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో టీటీడీని కూడా వైసీపీ నేతలు భ్రష్టుపట్టించారని గురజాల జగన్మోహన్ అన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి ప్రసాదాన్ని కలుషితం చేశారని దుయ్యబట్టారు. తప్పు చేసిన వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా వదిలే ప్రసక్తే లేదన్నారు.



దోషులు తప్పించుకోలేరు

కలియుగ దైవం వెంకన్న దృష్టి నుంచి దోషులెవరూ తప్పించుకోలేరు. తిరుమలలో ఏమీ జరగలేదని, చంద్రబాబు అబద్దాలు చెబుతున్నారని జగన్‌రెడ్డి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. శ్రీవాణి ట్రస్టు నిధులు మాయం, అగ్నిప్రమాదంలో కొన్ని ఫైళ్లు దగ్ధం కావడం నిజం కాదా? కల్తీ నెయ్యి విషయమై శ్రీవారి భక్తుల్లో అలజడి రేపిన ఘనత జగన్‌రెడ్డికి దక్కింది.

-నరసింహాయాదవ్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు



సీబీఐ విచారణ చేయాలి

పవిత్రమైన లడ్డూను అపవిత్రం చేసిన అంశంపై సీబీఐతో విచారణ జరిపించి, దోషులను శిక్షించాలి. రీటెండరింగ్ విధానంతో రూ.320కే కిలో నెయ్యి కొన్నామని ప్రగల్భాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి, ధర్మారెడ్డి ఇప్పుడు సమాధానం చెప్పాలి. గత ఐదేళ్లలో నిత్యం కొండపై శిలువ గుర్తులు, కాఫీ కప్పులు, గంజాయి అమ్మకాలు సాగాయి. జే బ్రాండ్ మద్యం తరహాలో జగన్ బ్రాండ్ నెయ్యి తెచ్చారు.

- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే



కల్తీ నెయ్యితో రూ.కోట్లు దోచుకున్నారు

కల్తీ నెయ్యితో స్వామి వారికి నైవేద్యాలు చేయించి, రూ.కోట్లు దోచుకున్న మాజీ సీఎం జగన్, మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలు కాలగర్భంలో కలసిపోతారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి దుయ్యబట్టారు. ఈ వ్యవహారంలో బాధ్యులను అరెస్టు చేయాలని బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, మునిసుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేశారు. హిందువుల ఆరాధ్య దైవం తిరుమలను ఐదేళ్లలో అపవిత్రం చేసి ఇష్టానుసారంగా దోచుకున్నారని, ల్యాబ్ నివేదిక బయటపెట్టడంతో అవినీతికి పాల్పడిన అధికారులు, ఛైర్మన్లు తడుముకుంటున్నారన్నారు. క్రిస్టియన్ మిషనరీలతో చేతులు కలిపి తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా జగన్ ప్రవర్తించారని ఆరోపించారు.

భక్తులకు ధర్మారెడ్డి సమాధానం చెప్పాలి

కమీషన్ల కోసం హిందువుల మనోభావాలను దెబ్బతీసిన అప్పటి ఈవో ధర్మారెడ్డి సమాధానం చెప్పాలి. ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇవ్వాలి. సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. వైసీపీ పాలనలో ధర్మకర్తల మండలి డమ్మీగా మారింది.

- నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత



కల్తీ నెయ్యిపై దర్యాప్తు చేపట్టాలి

శ్రీవారి లడ్డూల్లో వినియోగించిన కల్తీ నెయ్యి అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. నెయ్యిలో కల్తీ జరగడంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో శ్రీవారి పరకామణిలో జరిగిన దోపిడీ గురించి కూడా విచారణ చేయమని గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. ఈ కుట్రలో అప్పటి ఈవో ధర్మారెడ్డి, ఛైర్మన్ కరుణాకర రెడ్డి, విజిలెన్స్, పోలీసు అధికారులు ఉన్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశంలోనూ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం.

- తిరుమలలో ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



బాధ్యులను అరెస్టు చేయాలి

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి హిందువుల మనోభావాలకు గండి కొట్టిన మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలను అరెస్టు చేయాలని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. జనసేన నాయకులతో కలిసి ఆయన శనివారం లడ్డూ, వడ చేతిలో పెట్టుకుని నిరసన తెలిపారు. తిరుమల పవిత్రతను, ప్రసాదాన్ని అపవిత్రం చేసి నీతులు వల్లించడం జగన్ రెడ్డికే చెల్లుతుందన్నారు. తిరుమల ఆలయాన్ని,పోటును సంప్రోక్షణ చేయాలని కోరారు. ఈ మేరకు ఎస్పీ సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు.





నేటితో ముగియనున్న బదిలీల గడువు

● రాజకీయ సిఫార్సులతో జిల్లా యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21: ఉద్యోగుల బదిలీలకు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తొలి విడతగా బదిలీల జాబితాను తయారు చేసింది. విద్య, వైద్య, వ్యవసాయ అనుబంధ శాఖల్లో మినహా మిగిలిన 15 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. వాస్తవానికి ఈనెల 15వ తేదీకల్లా ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగిసింది. అయితే భారీ వర్షాలు, వరదల కారణంగా ఉద్యోగులంతా విజయవాడ తరలివెళ్లడంతో బదిలీలను వాయిదా వేసింది. చివరికి ఆదివారం నాటికి బదిలీల ప్రక్రియకు తుది గడువు ప్రకటించింది. ఈ క్రమంలో సిఫారసు లేఖలతో అధికారులపై ఒత్తిడి చేస్తూ కోరుకున్న చోటు దక్కించుకునేందుకు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లాపరిషత్, డీఆర్‌డీఏ, డ్వామా, ఇంజనీరింగ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం తమదైన శైలిలో పైరవీలు ప్రారంభించారు. శనివారం రాత్రి పొద్దుపోయే వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల బదిలీల ప్రక్రియపై అధికారులు కసరత్తు చేశారు. జిల్లాలో 34 మండలాలకు సంబంధించి వీఆర్వో, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల జాబితా సిద్ధమైంది. ఆదివారం సాయంత్రానికల్లా రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు అధికారికంగా వెలువడనున్నాయి. గ్రేడ్ 1, గ్రేడ్2, గ్రేడ్3, గ్రేడ్4 పంచాయతీ కార్యదర్శులకు వారి సీనియార్టీని బట్టి 450 పంచాయతీలకు పైగా నూతన పోస్టింగ్ ఇవ్వనున్నారు. చంద్రగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లో మేజర్ పంచాయతీ కార్యదర్శి పోస్టులకు విపరీతమైన పోటీ నెలకొంది. 'మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల నుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో వచ్చిన ఆర్డీవోలు (ఎస్‌డీసీ) సైతం ఇప్పటికీ జిల్లాలో కొనసాగుతున్నారు. వారి బదిలీలు కూడా ఆదివారం నాటికి రానున్నాయి. మిగిలిన శాఖల్లో కూడా బదిలీల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన ఈ బదిలీలు జరగనున్నాయి.

జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ బదిలీ

తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల అధికారి ఇ.ప్రతాప్ బదిలీ అయ్యారు. పరిశ్రమల శాఖలో జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన ఆయన కొత్త జిల్లాల ఆవిర్భావం నుంచీ తిరుపతి జిల్లా పరిశ్రమల అధికారిగా కొనసాగుతున్నారు. తాజాగా ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా ఆయన ఏలూరు జిల్లా పరిశ్రమల అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు. కాగా గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూడా పనిచేసిన ప్రతాప్ చురుకైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

ఓను.... వాళ్ళిద్దరూ రాజీపడ్డారు!

● కొత్త మలుపు తిరిగిన ఆదిమూలం కేసు

సత్యవేడు, సెప్టెంబరు 21: లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెండైన టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కేసు కొత్త మలుపు తిరిగింది. తనను ఎమ్మెల్యే ఆదిమూలం పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేసి,అత్యాచారానికి పాల్పడ్డారని అందుకు సంబంధించిన వీడియో టేపులను మీడియాకు విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన కేవీబీపురం మండలానికి చెందిన బాధిత మహిళ చివరకు ఆయనతో రాజీ పడినట్లు సమాచారం.తనను ఎమ్మెల్యే ఆదిమూలం లైంగికంగా వేధించాడని తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిన ఆమె శుక్రవారం హైకోర్టుకు హాజరై ఎమ్మెల్యేపై తాను పెట్టిన కేసు, అందులో పేర్కొన్న ఆరోపణలు అవాస్తవమని నివేదించడం గమనార్హం. తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆదిమూలం తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు.ఆదిమూలంపై పోలీసులు పెట్టిన కేసులో సెక్షన్లు వర్తించవని, మహిళా పోలీసు అధికారిణి నమోదు చేయాల్సిన కేసును పురుష పోలీసు అధికారి నమోదు చేశారని,జూలై, ఆగస్టునెలల్లో సంఘటన జరిగితే సెప్టెంబరు 5న కేసు నమోదు చేశారని ఆయన కోర్టుకు వివరించారు. ఇదిలా ఉండగా మూడవ వ్యక్తి ప్రమేయంతోనే మహిళ కేసు పెట్టిందని,ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని కేసును కొట్టి వేయాలని కోరారు. మరోవైపు బాధిత మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అంశాలన్నీ అవాస్తవమని, ఈ మేరకు నోటరీతో కూడిన అఫిడవిట్‌ను బాధిత మహిళ కోర్టుకు సమర్పించిందని, అందువల్ల ఈ కేసును కొట్టి వేయాలని మహిళ తరఫు న్యాయవాది జితేందర్ సైతం కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృష్ణసాగర్ తీర్పును ఈ నెల 25వ తేదీకి రిజర్వ్ చేశారు. అంతవరకు ఈ కేసులో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సంచలనం కలిగించిన ఈ కేసులో బాధిత మహిళ యూటర్న్ తీసుకుని ఎమ్మెల్యేతో రాజీ కుదుర్చుకోవడం వెనుక నియోజకవర్గంలో అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. రాజీ కుదిర్చేందుకు ఐదు రోజులుగా విజయవాడలో సుదీర్ఘ మంతనాలు జరిగినట్లు సమాచారం.

సస్పెన్షన్ ఎత్తివేతపై చర్చ

ఎమ్మెల్యే ఆదిమూలంపై టీడీపీ అధిష్ఠానం వేసిన సస్పెన్షన్ వేటు ఉంటుందా కొనసాగుతుందా అన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. ఈ నెల 5న ఆదిమూలంపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో ఏబీఎన్‌లో ప్రసారమైన వార్తలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు ఆదేశాలతో గంటల వ్యవధిలోనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలో వరద సహాయక చర్యల్లో రాత్రింబవళ్ళు నిమగ్నమైన చంద్రబాబు, ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని సస్పెన్షన్‌కు చర్యలు తీసుకున్నారు. టీడీపీలో ఇలాంటి క్రమశిక్షణరాహిత్య చర్యలకు తావుండదని సస్పెన్షన్‌తో పార్టీ క్యాడర్‌ను పరోక్షంగా హెచ్చరించారు. అయితే ప్రస్తుతం ఆదిమూలం కేసు కోర్టులో వీగిపోతే ఆయన సస్పెన్షన్‌ను తొలగిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

శనీశ్వర సన్నిధానం స్వర్ణమయం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి స్వర్ణ తాపడం తోరణం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: ముక్కంటి ఆలయంలోని శనీశ్వరస్వామి సన్నిధానం స్వర్ణమయమైంది. హైదరాబాదుకు చెందిన వ్యాపారవేత్తలు మనోజ్, మహేష్‌రెడ్డి సొంత నిధులతో స్వర్ణతాపడం పనులు చేయించారు. స్వర్ణమయమైన తర్వాత తొలిసారి పూజలను శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా దాతలు స్వామివారికి అలంకరించే పీఠం, తోరణంతో పాటు వివిధ స్వర్ణతాపడంతో తయారు చేసిన పూజా సామగ్రిని అందజేశారు. అర్చకులు సన్నిధిని శుద్ధిచేసిన అనంతరం సంకల్ప పూజలతో శనీశ్వరమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. వారు జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈవో ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణ తాపడం చేసిన శనీశ్వరస్వామి సన్నిధానం

తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి



తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం శ్రీకాళహస్తి ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్ తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పుత్తూరులో పెట్రోలు బంకు ఏర్పాటుకు సంబంధించి ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న శీను అనే వ్యక్తిని లంచం పేరిట వేధించారన్న ఆరోపణలపై తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న ఆ పోస్టులో ప్రభుత్వం రెగ్యులర్ ఆర్డీవోను నియమించే వరకూ శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

మూడిళ్లలో చోరీ

448 గ్రాముల బంగారు నగలు, 7.5 కిలోల వెండి, రూ.11 లక్షల నగదు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21: తిరుపతి రూరల్ మండలం తిరుమల నగర్‌లో దొంగలు చెలరేగిపోయారు. ఏకకాలంలో మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఎమ్మార్‌పల్లి సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాలివి.. తిరుమల నగర్ మొదటి వీధిలోని ఎన్.నాగరాజు శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఇంటి పైభాగంలో పడుకున్నాడు. ఉదయం లేచి చేసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బెడ్‌రూము బీరువాలో సుమారు 420 గ్రాముల బంగారు ఆభరణాలు, 800 గ్రాముల వెండి వస్తువులు, రూ.11 లక్షల నగదు కనిపించలేదు. వెంటనే తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణం, డీఎస్పీ ప్రసాద్,సీఐ చిన్నగోవిందు వచ్చి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. అలాగే టెలిఫోన్ కాలనీకి చెందిన జి.సురేష్ కుటుంబం విజయవాడకు వెళ్లింది. ఈ విషయాన్ని పసిగట్టిన దొంగలు అతని ఇంట్లో ఆరు కిలోల వెండి వస్తువులు అపహరించారు. టీటీడీలో పనిచేస్తున్న వెంకటరమణ కుటుంబంతో బయటకు వెళ్లారు. వారి ఇంట్లో కూడా దొంగలు చొరబడి 25 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



చోరీ జరిగిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

భక్తులు మెచ్చేలా పోలేరమ్మ జాతర
ప్రతి భక్తుడికీ అమ్మవారి దర్శనం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 21: వెంకటగిరి పోలేరమ్మ జాతరను భక్తులందరూ మెచ్చేవిధంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. స్థానిక పింజలవీరయ్య కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన శాంతి సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ జాతరకు రాష్ట్రమంతా గుర్తించేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 22వ తేదీ పోలేరమ్మ రాకను తెలియపరిచే ఘటోత్సవంతో జాతర ప్రారంభమై ఈనెల 26వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సాగుతుందన్నారు. 22న రాత్రి 7 గంటలకు పోలేరమ్మ దేవస్థానం ఆర్చి వద్ద మ్యూజికల్ నైట్, 23న సాయంత్ర 6 గంటలకు త్రిభవని సెంటరు నుంచి పోలేరమ్మ దేవస్థానం వరకు అమ్మవారికి భక్తులు, దాతల విరాళాలతో తయారు చేసిన అమ్మవారి బంగారు పాదుకల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు వెంకటేశ్వర ప్యాలెస్ సెంటరు నుంచి పోలేరమ్మ దేవస్థానం మీదుగా జగన్నాథపురం వారి కాంతారా బృందం నృత్య ప్రదర్శన, 25న సాయంత్రం 6 గంటలకు వెంకటేశ్వర ప్యాలెస్ నుంచి అమ్మవారి దేవస్థానం మీదుగా వరంగల్ వారి బోనాల కోలాటం, డ్రమ్స్ వాయిద్యాలు, పాతబస్టాండు సమీపంలో రాత్రి 8గంటలకు బాణసంచా ప్రదర్శన, జీనిగుల వారి వీధి నుంచి అమ్మవారి ఉత్సవంలో రాత్రి 1 గంటకు అమ్మవారి దేవస్థానం వరకు బొట్టబొమ్మల ప్రదర్శన, 26వ తేదీ అమ్మవారి నిరూపోత్సవంతో జాతర ముగుస్తుందన్నారు. సమావేశానికి హాజరైన ప్రజలు జాతర నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, సీఐ రమణ, టీడీపీ నాయకుడు గంగోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి బంగారు పాదుకలకు దాతల విరాళం

అమ్మవారి బంగారు పదుకల తయారీకి పలువురు దాతలు విరాళాలు అందించారు. జీఎస్ఆర్ ట్రస్టు అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు రూ.లక్ష, గౌరీశంకర్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకుడు రూ.50వేల చెక్కు పులికొల్లు రాజేశ్వరరావు చేతుల మీదుగా ఎమ్మెల్యేకి అందచేశారు. అలాగే డక్కిలి మండలం నాగవోలు గ్రామానికి చెందిన పోలి సురేష్ దంపతులు రూ.50,116 నగదు అందచేశారు.

నేడు ఘటోత్సవం

వెంకటగిరి, సెప్టెంబరు 21: వెంకటగిరి గ్రామశక్తి పోలరమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన ఘటోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి రాకను తెలియచెప్పే ఘటోత్సవంలో కాంపాళెం వద్ద రెడ్డివారి సాంగ్యంగా అమ్మవారికి బలిఇచ్చే దున్నపోతును అందజేస్తారు. అమ్మవారి అత్తవారి ఇల్లుగా భావించే జీనిగులవారి వీధిలోని చాకలి మండపం వద్ద దున్నపోతుకు పూజలు నిర్వహిస్తారు. అదే మండపంలో చాకలివారి సాంగ్యంగా పొలికుండలను ధాన్యం గింజలపై పెట్టి సమర్పిస్తారు. బలిజ సామాజికవర్గానికి చెందిన పత్తివారు దున్నపోతుకు, ఘటం కుండలకు తొలిపూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి దున్నపోతు, ఘటం కుండలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారి దేవస్థానం వద్ద వుంచి పూజలు చేశారు. అనంతరం ఘటం కుండలను రాజాల వంటశాలలో వుంచి నగిరి సారేలను సమర్పిస్తారు. అక్కడి నుంచి పొలికుండలు, బలి దున్నపోతు పురవీధుల్లో ఊరేగుతూ భక్తుల పూజలు అందుకొంటాయి. ఈ తంతు ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వెంకటగిరి, సెప్టెంబరు 21: వెంకటగిరి పట్టణంలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని శివాలయం వీధి, కాశీపేట, జ్యోతి మహల్ సెంటర్, త్రిభవని సెంటర్, మున్సిపల్ కార్యాలయం, కాలేజీ మిట్ట, మందలిల్లు, మనులాలపేట, మల్లమ్మగుడి వీధి, గోషాసుపత్రి ప్రాంతం, నారాయణ స్కూల్, రాణీపేట, తహసీల్దార్ కార్యాలయం, ఉపాధ్యాయ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

తూపిలిపాళెం తీరంలో స్వచ్ఛ సాగర్... సురక్షిత సాగర్



తీరంలో ప్లాస్టిక్‌ను తొలగిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

వాకాడు, సెప్టెంబరు 21: తూపిలిపాళెం సముద్రతీరంలో మత్స్యకార సేవా సమితి, ఇన్‌కాయిస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్... సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ట్ శాస్త్రవేత్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో చేరడం వల్ల మత్స్యజాతి నశించిపోతుందన్నారు. నీరు కలుషితమై మానవజాతి మనుగడకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, చెదారాలు సేకరించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌గౌడ్, మత్స్యకార సేవాసమితి సభ్యులు వాసంగారి వెంకటరమణయ్య, ఎఫ్‌డీవో రఘు, పూడి మహేంద్ర, మారం రెడ్డి కిరణ్‌రెడ్డి, ఇన్‌కాయిస్ట్ సభ్యులు నాగూజీరావు, పంచాయతీ కార్యదర్శి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

సముద్రతీర ప్రాంతంలో
పర్యావరణాన్ని కాపాడాలి

తడ, సెప్టెంబరు 21: సముద్రతీర ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎఫ్‌వో నాగరాజు తెలిపారు. కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఇన్‌కాయిస్ట్ సంస్థ శనివారం భీములవారిపాళెం రేవు వద్ద సముద్ర పర్యావరణంపై మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించింది. సముద్రజలాల్లో విషపూరిత నాచును గుర్తించి పర్యవేక్షించడం ద్వారా సముద్ర పర్యావరణం కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అటవీశాఖ ఎస్ఎఫ్‌డీటీ పోలయ్య, ఎంఈవో మల్లికార్జున, ఎఫ్ఆర్‌వో నరసింహరావు, ఇన్‌కాయిస్ట్ సభ్యుడు విఘ్నేష్, టీడీపీ మత్స్యకార నాయకులు బొమ్మన శ్రీధర్, సెల్వీ, సుధాకర్, ధనంజయ, ఎంపీటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి భూముల వేలం

చిల్లకూరు, సెప్టెంబరు 21: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి భూములకు శనివారం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. సర్వే నంబరు 92-3లో 25 ఎకరాలను రూ.1.71లక్షలు, 16.34 ఎకరాలను రూ.1.12లక్షలు, 21 ఎకరాలను రూ.1.50లక్షలు, 21.68 ఎకరాలను 1,40,600కు జానకిరామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరటాసి నెల ఆస్థాన ఉత్సవాలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21: సూళ్లూరుపేటలోని మద్వేంకట రామ్మూర్తి స్వామి ఆలయంలో పెరటాసి నెల ఆస్థాన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తొలి శనివారం స్వామివారికి పుష్పాలంకరణ చేశారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమార్ దీక్షితులు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు.

ప్రసన్న వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోట, సెప్టెంబరు 21: మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, కోటలోని శ్రీలక్ష్మకాలనీల్లో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో పండితుల ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి విగ్రహాలకు పలు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలో ఉంచారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

తమిళనాడువాసి మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 21: మండలంలోని మూర్తిరెడ్డిపాళెం సమీపంలో తమిళనాడు వాసి పరమశివం (50) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... తమిళనాడుకు చెందిన పరమశివం గత కొద్దిరోజులుగా నాయుడుపేట పట్టణంలో మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మూర్తిరెడ్డిపాళెం సమీపంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృత దేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతిగా మద్యం తాగడం వల్ల మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 21: నాయుడుపేట బేరిపేటలో నివాసం ఉంటున్న లక్ష్మి(40) శుక్రవారం ఎలుకల మందు తిని అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందింది.

మార్కెట్ రుసుం వసూలుకు 28న వేలం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 21: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్, మాంసం, చేపల దుకాణాలు, రోడ్డు మార్జిన్ వెంబడి దుకాణదారుల నుంచి దినసరి రుసుం వసూలు చేసేందుకు లీజు హక్కులకు 28వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెళ్లకూరు, సెప్టెంబరు 21: మండలంలోని యడపూడి స్వర్ణముఖినది నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు వీఆర్వో వంశీకృష్ణ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

వెంకటగిరి, సెప్టెంబరు 21: వెంకటగిరి పట్టణంలో ఈ నెల 25,26 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో అమ్మవారి అత్తవారి ఇల్లుగా భావించే జీనిగలవారి వీధి, చాకలి మండపం నుంచి అమ్మవారి రథం తిరిగే ప్రధాన వీధుల్లో రోడ్డుపైకి వచ్చి ఆక్రమణలను శనివారం అధికారులు తొలగించారు. సీఐ రమణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలని, లేని పక్షంలో మున్సిపల్ అధికారులు తొలగిస్తారని హెచ్చరించారు. జాతర జరిగే రెండు రోజుల పాటు అమ్మవారి రథం తిరిగే రోడ్ల పక్కన చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతించబోమన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు - హాజరైన భక్తులు

చిట్టమూరు, సెప్టెంబర్ 21: మల్లాంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. వేదపండితులు నాదెండ్ల రామేశ్వర గురుకుల్, ప్రధానార్చకులు భాను ప్రకాష్‌శర్మ స్వామి వారి చరిత్రను పఠిస్తూ కల్యాణ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధానార్చకులు భానుప్రకాష్‌శర్మ స్వామి అమ్మవార్లకు కంకణాలు కట్టి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి, సాహితి దంపతులతో పాటు ఉభయకర్తలు కల్యాణ వేదిక, పుష్పాలంకరణ, కానుకలను సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం తరపున అక్కడి వేద పండితులు పట్టు వస్త్రాలు, చందన విభూదిగంధ పరిమలాలతో కూడిన సుగంధ ద్రవ్య పరిమళాలను సమర్పించారు. వళ్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలు వేసి ఆశీర్వాదం పొందారు. స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులకు స్వామి ఉత్తరీయం, చిత్రపటాలను బహూకరించారు. అనంతరం ప్రసాద వినియోగం, బ్రహ్మణ సమారాధన కార్యకలాపాలను ఉభయకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు కల్పించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణ సమయంలో సుమారు 70జంటలకు పైగా నూతన వధువరులు వివాహాలు చేసుకున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా దువ్వూరు హనుమంతరామిరెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు శేషురెడ్డి, రామరాఘవరెడ్డి, రామలింగారెడ్డి భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

నేడు వసంతోత్సవం

వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వసంతోత్సవం ఆదివారం జరగనుంది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన: పాశం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

వాకాడు, సెప్టెంబరు 21: ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెంలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కూటమి నాయకులు, అధికారులతో కలసి ప్రారంభించారు. గతేడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ సమయంలో బాలిరెడ్డిపాళెం వద్ద తెగిపోయిన పొర్లుకట్ట, దెబ్బతిన్న వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం బాలిరెడ్డిపాళెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష నేరవేర్చేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటన, రూ.1000 పెంచి పింఛన్ల పంపిణీ, ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు, ధాన్యం కొనుగోలు బకాయిల విడుదల, స్థానిక సంస్థలకు నిధులు, అన్న క్యాంటీన్ల ప్రారంభం, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు వంటి కీలక నిర్ణయాలు వందరోజుల్లో తీసుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయబోతున్నట్లు తెలిపారు. 2014-2019 మధ్యకాలంలో పేదలు కట్టుకున్న ఇళ్లకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేశారని, ఆ లబ్ధిదారులందరికీ బిల్లులు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీరు, నాణ్యమైన విద్యుత్, రైతులకు సబ్సిడీ విత్తనాలు, మంచి ఆరోగ్యం, పాడిరైతులకు అవగాహన కల్పిస్తూ, గృహాల ఏర్పాటుకు కృషి లాంటివి చేయాలన్నారు. వాకాడు మండలంలో వందల ఎకరాలు ఆక్రమణకు గురికావడంతో తహసీల్దారు క్షుణ్ణంగా పరిశీలించి కబ్జాకు గురైన భూమిని పేదలకు పంచేలా చూస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కుంచం దయాకర్, చింతల మోహన్‌నాయుడు, పంత్రాంగం అరుణ్, బత్తిన ప్రమీల, తీపలపూడి రమణయ్య, కోటా శ్రీనివాసులు, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభం నుంచి సంక్షేమంలోకి: విజయశ్రీ



మానమాల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, సెప్టెంబరు 21: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచేనాటికి సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని వంద రోజుల్లో సంక్షేమంలోకి నడిపించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం మానమాలలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందరోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దోపిడీ, దౌర్జన్యాలు, అవినీతి, అధికార దుర్వినియోగంతో సాగిన పాలనకు చరమగీతం పాడుతూ ప్రజలు గొప్ప తీర్పు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వంలో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కూడా కల్తీ నెయ్యితో అపవిత్ర చేయడం వైసీపీ నేతల దుర్మార్గానికి పరాకాష్ట అని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో రజనీకాంత్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కొండలరావు, జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్, నాయకులు గోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, కంకణాల సత్యవరప్రసాద్‌రావు, పాదర్తి ప్రకాశ్‌నాయుడు, ఖలీల్ పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

దొరవారిసత్రం, సెప్టెంబరు 21: దొరవారిసత్రం మండలం నెలబల్లి తెలుగుగంగ కాలువ వంతెన సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి బోల్తా పడింది. నెల్లూరు నగరానికి చెందిన రవికుమార్‌రెడ్డి దంపతులు తమ కుమార్తెను అమెరికాకు పంపించేందుకు చెన్నై ఏయిర్‌పోర్టుకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వెళతుండగా కారులో టైరు కనెక్టివ్ రాడు విరిగి పోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. రవికుమార్‌రెడ్డి దంపతులను కారులో ఇరుక్కుపోవడంతో గమనించిన స్థానిక టీ దుకాణం నిర్వాహకులు, అటువైపుగా వెళ్లే మినీ లారీ సిబ్బంది సాయంతో బయటకు తీశారు. రవికుమార్‌రెడ్డి దంపతులకు ఎటువంటి గాయాలు కాలేదు.

25న ప్రజావేదిక సభ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 21: స్థానిక రెండో పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో ఈనెల 25వ తేదీన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి సంబంధించి ప్రజావేదిక సభను నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం బీసీ కాలనీ సమీపంలో సభ ఏర్పాటు స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సభ వేదికగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రజలకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం, నటశేఖర్, శ్రీదేవి, హరిబాబు, లక్ష్మణరావు అశోక్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు విరాళం అందజేత

గూడూరు, సెప్టెంబరు 21: గూడూరుకు చెందిన జనసేన నాయకుడు మునిగిరీష్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం చేపడుతున్న సేవా కార్యక్రమాలకు రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు.

గురజాడకు నివాళి

చిల్లకూరు, సెప్టెంబరు 21: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురజాడ వెంకట అప్పారావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మాధవయ్య, వ్రజేంద్రరెడ్డి, ఆదిలక్ష్మీ, శ్రీనివాసులు, సంధ్య, సురేంద్ర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్లదిబ్బ పాఠశాలలో వర్క్‌షాప్

చిల్లకూరు, సెప్టెంబరు 21: మండలంలోని గుమ్మళ్లదిబ్బ ప్రాథమిక పాఠశాలలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య, పాఠశాలలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ వంటి అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రాజేష్ రంజన్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మహాజన సభ

పెళ్లకూరు, సెప్టెంబరు 21: మండల కేంద్రమైన పెళ్లకూరులోని చిల్లకూరు పీఏసీఎస్ మహాజన సభ ఆ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ఇన్‌చార్జి సీఈవో రవీంద్రయ్య మాట్లాడుతూ సంఘం సభ్యులు తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రెండు ఫొటోలు ఇవ్వాలని, లేదంటే సంఘం నుంచి తొలిగించడం జరుగుతుందన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనకు మెరుగైన వసతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెంచలయ్య

గూడూరు, సెప్టెంబరు 21: తమ కళాశాలలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు బహుళజాతి కంపెనీల సహకారంతో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఆదిశంకర కళాశాల చైర్మన్ పెంచలయ్య తెలిపారు. శనివారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విశాఖపట్నానికి చెందిన డెమి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సహకారంతో ఏర్పాటు చేసిన కాంపిటేటివ్ ప్రోగామింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. కాంపిటేటివ్ ప్రోగామింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థితికి చేరుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచు కోవాలన్నారు. కార్యక్రమంలో అవినాష్, ఛార్లెస్ గాడ్విన్, అభినయ ఇలాంగోవన్, వేణుమాదవ్, రాజయ్య, పవన్‌కుమార్, వంకి అనూష, రామయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట కమిషనర్‌గా చిన్నయ్య

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21: సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌గా కె.చిన్నయ్య నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ బదిలీపై ఆత్మకూరుకు వెళ్లిన విషయం తెలిసిందే. గురజాల నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యను సూళ్లూరుపేట కమిషనర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు

గూడూరు, సెప్టెంబరు 21: స్థానిక ఏపరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ శనివారం ముగిశాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారిని మండలస్థాయి జట్లకు ఎంపిక చేయడం జరిగిందని వ్యాయామ ఉపాధ్యాయలు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు 26వ తేదీన కోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న నియోజవర్గస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కరీముల్లాఖాన్, వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, శివకుమార్ పాల్గొన్నారు.

కోట: స్థానిక అల్లారెడ్డి వెంకటకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు అండర్-14, అండర్-16 విభాగాల్లో కబడ్డీ, చెస్, రన్నింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. మండలస్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

చిల్లకూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17, గురుకుల పాఠశాలలో అండర్-19 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మిటన్, అథ్లెటిక్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీలు శ్రీనివాసులు, శిరేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, మల్లికార్జున్‌రావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో నియోజకవర్గ క్రీడా పోటీలు

కోట, సెప్టెంబరు 21: కోటలోని అల్లారెడ్డి వెంకటకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 26, 27 తేదీల్లో నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని ఎంఈవో మస్తానయ్య శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మిక్సిడ్‌కాలనీ, శంకరన్ గిరిజనకాలనీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. రూ.3వేలు ఉన్న పెన్షన్‌ను రూ.1000 పెంచి రూ.4వేలు ఒకటో తేదీన ఇంటి వద్దకే అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. విజయవాడలో వరదల సమయంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టిన సమర్థవంతమైన నేత చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో కొండా రామచంద్రారెడ్డి, దాసరి రామ్‌ప్రసాద్, రాజేంద్ర, మధు, సుబ్బయ్య, సురేష్‌బాబు, బాలరమణయ్య, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలన



మన్నారుపోలూరు గిరిజన కాలనీవాసులతో టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21: రాష్ట్రంలో రాక్షస పాలనపోయి ప్రజాపాలన వచ్చి వంద రోజులు పూర్తయిందని నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కొండలరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం మన్నారు పోలూరు గిరిజన కాలనీల్లో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు మాధవ నాయుడు, నాయకులు వాకచర్ల రమేష్, మునస్వామి, ఎం.వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య యుగంధర్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో గురుకులానికి తాగునీరు

నాయుడుపేట, సెప్టెంబరు 21: నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ఆర్థిక చేయూతతో తాగునీటి సమస్య పరిష్కారం అయిందని ప్రిన్సిపాల్ దాదాపీర్ తెలిపారు. ఇటీవల గురుకులంలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో సెప్టిక్ ట్యాంక్ పక్కన ఉన్న బోరునీటి సరఫరాను నిలిపివేశారు. ప్రతిరోజు రూ.800 వ్యయంతో మినరల్ వాటర్ అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుడు శేఖర్‌బాబు దయాకర్‌రెడ్డికి విషయం తెలియజేయడంతో ఆయన స్వర్ణముఖినదిలో మరమ్మతులకు గురైన బోరును రిపేరు చేయించడంతో పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేశారు.

హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష వద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నవజీవన్ నిర్వాహకుడు బాలాజి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21: హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని నవజీవన్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు ఆర్‌కే.బాలాజి అన్నారు. శనివారం స్థానిక సత్యం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ సోకిన వారిని ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారితో కలిసి ఉండడం, భోజనం చేయడం వల్ల హెచ్ఐవీ సోకదన్నారు. హెచ్ఐవీ సోకకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గిరిరెడ్డి, నవజీవన్ ఆర్గనైజేషన్ సిబ్బంది మంజుల, నందిని, శ్రీవల్లీ, రేవతి తదితరులు పాల్గొన్నారు.